


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 21-08-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 321 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## రాజకీయ ఒత్తిళ్లకు
# లొంగని నేత అటల్ జీ..



న్యూఢిల్లీ: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సిద్ధాంతాలతో ఎప్పుడూ రాజీపడ లేదని, భారత్‌ను అణుశక్తి దేశంగా రూపొందించిన ఘనత ఆయనదేనని ప్రధాని మోదీ అన్నారు. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన వాజ్‌పేయి సంతాప సభలో పార్టీలకు అతీతంగా ప్రముఖులంతా పాల్గొని ఆయన స్మృతులను నెమరు వేసుకున్నారు. దివంగత ప్రధానికి ఘనంగా నివాళు లర్పించారు. వాజ్‌పేయి దత్తపుత్రిక నమిత భట్టాచార్య, మనుమరాలు నీహారిక సైతం సంతాప సభలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, మన శాస్త్రవేత్తలకు గర్వకారణంగా నిలిచిన అణుపరీక్షల వ్యవహారంలో వాజ్‌పేయి ఎలాంటి వెనుకడుగు వేయలేదని, ఒత్తిళ్లకు లొంగలేదని, అదే అటల్‌జీ ప్రత్యేకత అని అన్నారు. కశ్మీర్ అంశంపై ఇండియాను ఎవరూ ఇరకాటంలో పెట్టేందుకు వీలులేని విధంగా భారత వైఖరిని, వాస్తవాలను సమర్ధవంతంగా బయట ప్రపంచానికి వాజ్‌పేయి చాటి చెప్పారని, ప్రపంచవేదికపై ఉగ్రవాదం కీలక అంశంగా మారిందంటే అటల్ చూపిన చొరవే అందుకు కారణమని అన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకూ లొంగ లేదన్నారు. ప్రతిపక్షంలో ఎన్నో ఏళ్లు ఉన్నప్పటికీ సిద్ధాంతాల విషయంలో మాత్రం రాజీపడలేదన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పార్లమెంటరీ సంప్రదాయాలకు గౌరవం తెచ్చిపెట్టిన ఖ్యాతి ఆయనకే దక్కుతుందన్నారు. ప్రధానిగా ఉన్నప్పుడు వాజ్‌పేయి ఏర్పాటు చేసిన మూడు రాష్ట్రాలు అభ్యుదయపథంలో పయనిస్తున్నాయని, ఎలాంటి చిక్కులు లేకుండా శాంతి యుతంగా తరువాయి 2లో..



### మానవాళి మరువని మహానేత వాజ్‌పేయి

మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయిని మాస్ నేతగా ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ అభివర్ణించారు. ఆయన మాటలు, చేసిన మంచి పనులు చిరస్థాయిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని అన్నారు. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన వాజ్‌పేయి సంతాప సభలో మోహన్ భగవత్ పాల్గొని మాట్లాడారు. అటల్ జీ మాటలు, ఆయన జీవితాన్ని తరువాయి 2లో..




# గోదారి ఉగ్రరూపం

- కాటన్ బ్యారేజీకి జలకళ
- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- రవాణా వ్యవస్థను నియంత్రించిన అధికారులు
- సెల్ఫీల మోజులో ప్రాణాలు పోగొట్టుకోవద్దు
- యువతకు అధికారుల హెచ్చరిక

ధవళేశ్వరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ జలకళను సంతరించుకుంది. బ్యారేజీ నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఈ కారణంగా బ్యారేజీపై కేవలం ద్విచక్రవాహనాలను మాత్రమే అధికారులు అనుమతిస్తున్నారు. కార్లు, భారీ వాహనాల ప్రయాణాన్ని నిషేధించారు. దీంతో పలువురు తరువాయి 2లో..

# కేరళ ప్రజలకు నెల జీతం విరాళం

**రాజ్యసభ ఉదారత .. కుండపోత వర్షాలు.. అస్తవ్యస్తమైన జనజీవనం**


**రూపుకోల్పోయిన దేవభూమి .. 400వందల మంది మృతులు.. వేలాదిమంది నిరాశ్రయులు**

దిల్లీ: కుండపోత వర్షాలు, వరద బీభత్సంతో బెంబేలెత్తిపోయిన కేరళ వాసులకు ఇప్పుడిప్పుడే ఊరట లభిస్తోంది. వర్షాలు కాస్త తగ్గడంతో వరద ప్రభావం కూడా తగ్గుముఖం పడుతోంది. అయితే రూపుకోల్పోయిన దేవభూమికి మాత్రం తిరిగి పూర్వవైభవం రావాలంటే మరికొంత కాలం పడుతుంది. దాదాపు 12 రోజుల పాటు వరద ముప్పుతో అతలాకుతలమైన కేరళలో సుమారు 400వందల మంది ప్రాణాలు వదిలారు. వేలమంది నిరాశ్రయులయ్యారు. దాదాపు మూడున్నర లక్షలమంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు చేరారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రకృతి అందాలకు నెలవైన కేరళకు ఆపన్న హస్తం అందించ డానికి సినీ, క్రీడా ప్రముఖులు ముందుకు వస్తున్న తరుణంలో ఉపరాష్ట్రపతి సచివాలయ సిబ్బంది కూడా మేముసైతం అంటున్నారు. ఇందులో భాగంగా వారి నెల జీతాన్ని కేరళ ప్రజల కోసం సీఎం సహాయ నిధికి పంపనున్నారు. ఈ మేరకు సోమవారం ఉపరాష్ట్రపతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీర్మానించారు.

కేరళ పరిస్థితిపై సమీక్షించడాని జరిగిన ఈ సమావేశంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి సచివాలయ సిబ్బంది, ఇతర సీనియర్ అధికారులు అందరూ కలిసి తమ నెల వేతనాన్ని తరువాయి 2లో..

# భారీ వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

- ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశం
- రెవెన్యూ, పోలీస్, విపత్తు నిర్వహణ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- జన సంరక్షణపై అధికారులతో టెలికాన్ఫరెన్స్



అమరావతిః రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి చంద్ర బాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్సులో జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వరద లతో కేరళ కకావికలం అయ్యిందని చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందును లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిం చాలని అధికారులను ఆదేశించారు. ప్రాణ నష్టం నివారించడంతో తరువాయి 2లో..

# కాంగ్రెస్‌తో చంద్రబాబు చెట్టాపట్టాల్

- నాటి బ్రిటిష్ పాలనకు నేడు బాబు పాలకు తేడా లేదు
- అధికారంలో వస్తే నెల రోజుల్లో సిపిఎస్ రద్దు
- ఎక్కడ చూసినా యధేచ్ఛగా దోపిడీ
- అవినీతే చంద్రబాబు ఎజెండా
- కోటవురట్ల బహిరంగ సభలో వైఎస్ జగన్ ధ్వజం



నర్సీపట్నం/ కోటవురట్లః నియంత పోకడలు గల కాంగ్రెస్ పాలనకు విసుగు చెంది తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని నిలిపేందుకు ఏర్పడిన తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను నట్టేట ముంచుతూ కాంగ్రెస్‌తో చంద్రబాబు నాయుడు చెట్టాపట్టాల్ వేసుకుని తిరుగుతున్నాడని ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా వైఎస్ జగన్ చంద్రబాబు పాలనపై ధ్వజమెత్తారు.

నాటి బ్రిటిష్ పాలనకు, నేటి చంద్రబాబు పాలనకు తేడా లేకుండా పోతోందని జగన్ విమర్శించారు. సీఎం చంద్రబాబు ఐదు పార్టీలను పెళ్లి చేసుకుని వదిలేశారని.. తాజాగా కాంగ్రెస్‌తో పెళ్లికి సిద్ధమయ్యారని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండిపడ్డారు. విశాఖ జిల్లాలో 241వ రోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఆయన కోటవురట్ల బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆద్యంతం ఆసక్తిగా సాగిన ఆయన ప్రసంగం ఇలా కొనసాగింది.

'బాబు పాలనలో చెరకు రైతులు బాధపడుతున్నారన్నారు. అదేంటో ఆయన సీఎం కాగానే షుగర్ ఫ్యాక్టరీలు నష్టాల బాట పడుతాయన్నారు. ఇప్పటికే జిల్లాలోని మూడు షుగర్ ఫ్యాక్టరీలను మూసేశారు. తాండవ, ఏటికొప్పాక, చోడవరం షుగర్ ఫ్యాక్టరీలు నష్టాల్లో ఉన్నాయి. నీరు-చెట్టు కింద రూ.20 కోట్లు దోచుకున్నారు. పాయకరావుపేట నియోజక వర్గంలో ఆ మహానేత వైఎస్ఆర్ 20 వేల ఇళ్లు కట్టించారు. ఇవాళ చంద్రబాబు ప్రభుత్వం కనీసం ఐదు ఇళ్లు కూడా కట్టించలేదు.

నక్కపల్లి ఆస్పత్రిలో ఐదుగురు డాక్టర్లు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. ఆ ఆస్పత్రిలో కనీసం మందులు కూడా లేవన్నారు. ఇక్కడి ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చరా?( లేదు లేదు అని ప్రజల నుంచి సమాధానం) భూములు లాక్కోవడానికి కేబినేట్ సమావేశం నిర్వహిస్తారని, కానీ ఇవ్వడానికి మాత్రం సమావేశం పెట్టరన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను (సీపీఎస్) రద్దు చేస్తానన్నారు. అధికారంలోకి రాగానే చేసే తొలిపని ఇదేనని జగన్ అనే నేను హామీ ఇస్తున్నాన్నారు.

. రైతన్నకు పెట్టుబడి తగ్గించగలిగితే ఆదాయం పెరుగుతుందన్నారు.

రైతులకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. క్రాప్ లోన్లను తీసుకుంటే వడ్డీ భారం లేకుండా చేస్తాం. పెట్టుబడి సాయం కింద ఏటా మే నెలలో రూ. 12500 చెల్లిస్తామని, ఉచిత బోర్లు.. టాక్స్ మినహాయింపు రైతులకు ఉచితంగా బోరు వేయిసామన్నారు. రూ.4 వేల కోట్లతో విపత్తుల నిధి ఏర్పాటు చేసి.. కరువు, వరదల తరువాయి 7లో..




# చంద్రబాబు పాలనలో రాష్ట్రం అప్పులపాలైంది

### ఏపీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి



అమరావతి: ముఖ్యమంత్రి చంద్ర బాబు పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకు పోయిందని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు తులసి రెడ్డి మండిపడ్డారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తులసిరెడ్డి మాట్లా డుతూ.. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి అమరావతి నగరాన్ని నిర్మించడం సిగ్గుచేటన్నారు. 1956 నుంచి 2014 వరకు 58 సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రూపాయలు అప్పు కాగా.. చంద్రబాబు నాలుగేళ్ళ పాలనలోనే రూ.1,49,435 కోట్ల మేర అప్పులు చేశారని ధ్వజమెత్తారు. చట్ట ప్రకారం రాజధాని తరువాయి 2లో..



# డిసిసిబి పాలక వర్గం రద్దు .. కక్ష సాధింపు చర్య

## వైయస్సార్ పార్టీ నేత మజ్జి శ్రీనివాసరావు ఆరోపణ



విజయనగరం: జిల్లాలో బలమైన సామాజిక వర్గానికి చెందిన మహిళ శ్రీమతి మరిశర్ల తులసి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కేంద్ర సహకారబ్యాంకు పాలక వర్గం రద్దుకు కారకులైన గనుల శాఖామంత్రి సుజయకృష్ణ రంగారావుకు ఆమె సామాజిక వర్గంప్రజలు తగిన బుద్ధి చెపుతారని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను) హెచ్చరించారు. సోమవారం స్థానిక సత్యాకార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 9 జిల్లాల డిసిసిబిల కాలపరిధి పెంచి కేవలం 4 జిల్లాల బ్యాంకులకు కాలపరిధి పెంచకుండా రద్దుచేసి పర్సన్ ఇన్‌చార్జిలను నియమించడం అన్యాయ మన్నారు. విజయనగరం డిసిసిబి రైతులకు రుణాలు మంజూరు, డిపాజిట్లు సేకరణతో పాటు సుపరిపాలన అందిస్తూ ప్రజాభిమానం పొందుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం కక్షతో పాలక వర్గాన్ని రద్దు చేసిందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలో 90 శాతం పిఏసియస్‌లు వైసిపి నాయకుల ఆధీనంలో ఉన్నందున వాటికి కాల పరిమితి ముగిసినప్పటికి ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం భయపడుతుందని శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. డిసిసిబిలో నాబార్డు నిర్వహించిన తనిఖీల సమయంలో చిన్నచిన్న కారణాలు చూపినప్పటికి అవి న్యాయస్థానంలో నిలవలేదని మరోమారు కాలపరిధితో కూడిన పునర్విచారణ జరపాలని న్యాయస్థానం ఆదేశించినట్లు ఆయన తెలిపారు.జిల్లాలో రాజకీయ నేపధ్యం కుటుంబంనుండి వచ్చిన విద్యావంతురాలు శ్రీమతి మరిశర్ల తులసి నేతృత్వంలోని పాలకవర్గంను రద్దు చేయడం మంత్రి సుజయకృష్ణరంగారావు అధికార అహంకారానికి నిదర్శన మన్నారు.ప్రతిపక్షపార్టీపై కుట్రపన్ని డిసిసిబి పాలకవర్గం రద్దుచేశారని జిల్లాలో సహకార ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని శ్రీనివాసరావు దీమా వ్యక్తం చేశారు. శ్రీమతి తులసీ మామ , భర్తలు ఈ బ్యాంకునకు ఎనలేని సేవలందించారని, రాజకీయంగా ఎంతో గుర్తింపున్న కుటుంభమని కూడా గ్రహించక సుజయకృష్ణ రంగారావు ఈ విధంగా అకుటుంభాన్ని అవమానించడం సరికాదని, దీనికి ఆయన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని శ్రీనివాసరావు హెచ్చరించారు. వైకాపా సీనియరు రాష్ట్రనాయకులు బొత్స సత్యనారాయణ ఇవన్నీ గౌరవించే ఆమెకు డిసిసిబి అద్యక్షురాలిగా చేశారని ఆయన పేర్కొన్నారు.పార్టీలు మార్చిన సుజయ్ మంత్రి పదవి పొందిన అధికారంతో ఒక మహిళపై ఈ విధంగా ప్రవర్తించడం హేయమైన చర్యగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలుగుదేశం ఎప్పుడూ రైతులకు వ్యతిరేకమేనని అంటూ పాలక వర్గం రద్దుపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి విజయం సాధిస్తామని శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.సమావేశంలో డిసిసిబి ఉపాద్య క్షులు చనమల్లు వెంకటరమణ, డైరక్టర్ లెంక శ్రీరాములు, పిఏసిఎస్ అద్యక్షులు పెనుమత్స అప్పలరాజు, రామునాయుడు, యడ్ల అప్పారావు, పార్టీ నాయకులు పిళ్ళా విజయ కుమార్, అవనాపు విజయ్, వలిరెడ్డి శ్రీనివాసులునాయుడు, జానా ప్రసాద్, రాము, పిన్నింటి చంద్రమౌళి,ముల్లు త్రినాధ్, పిలకా శ్రీనువాసరావు,రెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై చర్చకు మేము సిద్ధం



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు

నర్సీపట్నం : నర్సీపట్నం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు మేము సిద్దమని నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు అన్నారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడైనా మేము చర్యకు సిద్దంగా ఉన్నామన్నారు. విశాఖ భూస్కాములపై మాట్లాడుతున్నారు మొట్టమొదటిసారిగా విశాఖ భూస్కాములపై గళమెత్తిన నాయకులు అయ్యన్న పాత్రుడు అన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో గత నాలుగున్నర సంవత్స రాలుగా ఎప్పుడు లేని విధంగా సుమారు 1400 కోట్లు అభివృద్ధి చేస్తే అసలు అభివృద్ధి జరగలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పెదబడ్డేపల్లి గురుకుల పాఠశాలను ఇంటర్మీడియేట్ కళాశాలగా చేస్తానని చెప్పారని, అది దీనికి సంబంధించి త్వరలో జిఒ కూడా వస్తుందన్నారు. సరుగుడు పంచాయతీకి రూ.28 రోడ్లతో అభివృద్ధి చేశారన్నారు. ఎవరో రాసి ఇచ్చిన పేపర్ రాసి ఇచ్చిన స్కిప్ట్‌ను చదివారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, నాతవరం జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లాలం అబ్బారావు, మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షులు మీసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం అద్వర్యంలో ఫారెస్టు భూములుకు పట్టాలు ఇవ్వాలంటూ ధర్నా



చోడవరం ; పాడేరు మండలం మోదాపల్లి పంచాయతీ గుగ్ర గరువు వనుగుపల్లి పంచాయతీ చింతగన్నులు చీడిపాలెం మాతిక బంద గ్రామాలకు చెందిన గిరిజనులు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం అద్వర్యంలో ఫారెస్టు భూములు కు పట్టాలు ఇవ్వాలని చోడవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్ ఆవరణలో ధర్నా నిర్వహించారు మందు గా ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి రేంజ్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు రేంజ్ ర్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న గిరజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పి అప్పలనర్స గిరిజన సంఘం అధ్యక్షుడు పి లక్కు శ్రీ ను వాసు నాగిరెడ్డి సత్యనారాయణ అది క సంఖ్యలో మహిళలు గిరిజనులు పాల్గోన్నారు.

## పర్యావరణానికి సమిష్టి కృషి కావాలి: జిల్లా కలెక్టర్

విజయనగరం: పర్యావరణ సమతూల్యతకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ గ్రౌండులో సోమవారం వనం...మనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అకాల వర్షాలు, వరదలు, వాతావరణ కాలుష్యం, విపత్తులులకు ప్రధాన కారణం వాతావరణంలో సమతూలత్యత లేకపోవడమేనని అన్నారు. అనంతరం ఆయన 200 మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎస్పీ ఎం.నిర్సింగరావు, ఎఆర్ డిఎస్పీ ఎ.హనుమంతు, రిజర్వు ఇన్సకర్లు శ్రీహరిరావు, గురునాధరావు, రామకృష్ణ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : స్వర్గీయ భారతరత్న రాజీవ్‌గాంధీ 74వ జయంతిని నర్సీపట్నం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్త రాజీవ్‌గాంధీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి మీసాల సుబ్బన్న, నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రుత్తల శ్రీరామ్మూర్తి, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ నంగిన వెంకటరమణ, ఎస్సీసెల్ అధ్యక్షులు జెల్లి నాగభూషణం, సిద్దా, రాము, నాయకులు పాల్గొన్నారు.

## పవిత్రతకు వైదిక విశ్వాసాలకు మారు పేరు శ్రావణమాసం



విజయనగరం: పవిత్రతకు వైదిక విశ్వాసాలకు మారు పేరు, సకల శుభాలకు నెలవు శ్రావణ మాసం అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త జ్ఞానేశ్వర్ కళ్యాణ్ గురూజీ అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామ నారాయ ణంలో శ్రావణమాసం గొప్పతనం గురించి ప్రవచించారు. ఈ నెలలో సూర్యుడు సింహ రాశిలో ప్రవేశిస్తాడని, శ్రవణ నక్షత్రంతో పౌర్ణమి చంద్రుడు కూడిన మాసం కాబట్టి దీనిని శ్రావణమాసం అంటారని విశదీకరించారు. నాగ పంచమి, వరలక్ష్మీవ్రతం, ఋషి పంచమి, శీతలా సప్తమి, పోలాల అమావాస్య, దామోదర ద్వాదశి, వరాహ జయంతి, జంధ్యాల పూర్ణిమ, హయగ్రీవ జయంతి ఇలా అనేక పండుగల సమాహారం శ్రావణమాసమని, శ్రీకృష్ణుడు ద్రౌపదికి, నారదుడు సావిత్రీదేవికి ఉపదేశించిన మంగళగౌరి వ్రతం శ్రావణమాసంలోనే చేస్తారని అన్నారు. శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ మని, శ్రవణ నక్షత్రంపేరిట ఏర్పడిన శ్రావణ మాసం మహావిష్ణుపూజకు ఉత్కృష్ట మైనదని అన్నారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ గురూజీని ఘనంగా సత్కరించారు.

## వర్షాలకు బురదమయంగా రోడ్డు

నాతవరం : ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురద మయంగా మారుతున్నాయి. మండలంలోని గుమ్మిడుగొండ, వెదురుపల్లి, తాండవ తదితర రోడ్లు బురదతో అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో పాదచారులు అవస్థలు పడుతున్నారు.

## సత్తాచాటుకున్న ఎమ్మెల్యే పీలా

# బలం అంచనాకు ఉపయోగపడ్డ పుట్టినరోజు వేడుకలు



అనకాపల్లి : అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్య నారాయణపై కార్యకర్తల్లో అబిమానం చెక్కు చెదరలేదనేది శనివారం రుజువైంది. పట్టినరోజు సందర్భంగా శనివారం నూకాంబికా అలయంలో జరిగిన కార్యక్రమంలో నియెజకవర్గం నలుమూలలనుండి విచ్చేసిన అబిమానులు ఇందుకు నిదర్శనం అనక తప్పదు.ఒక విదంగా చెప్పాలంటే ఉహించిన దానికన్నా ఎక్కువ మంది ప్రజలు శుబాకాంక్షలు తెలియజేసేందుకు విచ్చేశారనక తప్పదు. అత్మీయ అబిమానాన్ని చాటు కున్నారు. నేతలు అదికారులుతో పాటు కార్యకర్తలు కూదా పెద్ద సంఖ్యలో రావడం అంతరంగికులను అనందోత్సాహల్లో ముంచెత్తించింది. రాబోయె ఎన్నికల సందర్బంగా ఇప్పటికే సన్నాహల్లోఉన్న పీలా అంతరంగికులు మరింత జోరుగా దూసుకు పోయేందుకు ఆస్కారం కల్పించిం దనటంలో సందేహం లేదు. ఇకపై చాపక్రింద నీరులా పని చేసుకు పోయేందుకు ప్రణాళికలు రుపొందిచకొనేందుకు సిద్దపడుతున్నారు. వచ్చినవారు ఎవరు..రానివారు ఎవరు అనేది కూడా తెలుసు కొనేందుకు ఈకార్యక్రమం దోహదపడుతుందని బావిస్తున్నారు. ఉన్నవారిని కలుపుకుపోయేందుకు ఈసభ చక్కగా ఉపయెగ పడింది.

టికెట్‌పై దీమాగా ఉన్న పీలా ఈవేదికను రాజ కీయంగా వినియోగించుకొనేందుకు పావులు కదుపుతున్నారు.ఎవరు బరిలో దిగిన అమితుమికి సిద్దమే అన్న సంకేతాలు ఇచ్చారు. రానున్న రోజులును సమరానికి సంకేతంగా సన్నద్దమవుతున్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## గోదారి ఉగ్రరూపం

వాహనదారులు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. మరోవైపు రాజమహేంద్రవరం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. దీంతో రోడ్ కమ్ రైల్వే వంతెనపై భారీ వాహనాలు ప్రయాణించకుండా అధికారులు నిషేధం విధించారు.

ధవళేశ్వరం బ్యారేజీకి భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోందని.. నీటిమట్టం మరింత పెరిగితే మూడో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేస్తామని జలవనరుల శాఖ ఈఈ ఆర్.మోహన్‌రావు తెలిపారు. గోదావరి ఉధ్ధృతి కారణంగా పడవ ప్రయాణాలను నిషేధించినట్లు చెప్పారు. గోదావరి తీరానికి ప్రజలెవరూ రావొద్దని.. యువకులు సెల్ఫీల మోజుతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన హెచ్చరించారు.

## రాజకీయ ఒత్తిళ్లకు లొంగని నేత వాజ్‌పేయి

రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. అటల్ జీ జీవితమంతా ప్రజాసేవకే వినియోగించారని, యువకుడిగా ఉన్నప్పుడే భారత ప్రజల సేవకు తన జీవితాన్ని అంకితం చేయాలని ఆయన నిర్ణయం తీసుకున్నారని ప్రధాని అన్నారు. ఒకే పార్టీ దేశ రాజకీయాలను శాసిస్తున్న రోజుల్లో వాజ్‌పేయి రాజకీయాల్లోకి వచ్చారని మోదీ పేర్కొన్నారు.

***కలిసి సినిమాలు చూశాం, పుస్తకాలు చదివాం..***

***అద్వాణీ***

మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయితో 65 ఏళ్ల పాటు స్నేహం చేసే అదృష్టం తనకు దక్కిందని, అన్నేళ్లూ ఆయనను చాలా దగ్గరగా తాను చూశానని బీజేపీ అగ్రనేత ఎల్.కె.అడ్వాణీ గుర్తు చేసుకున్నారు. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో సోమవారంనాడు జరిగిన వాజ్‌పేయి సంతాప సభలో అడ్వాణీ మాట్లాడుతూ, తామిద్దరూ కలిసి పనిచేశామని, అనుభవాలను పంచుకున్నామని, కలిసి సినిమాలు చూడటం, పుస్తకాలు చదవడం చేశామని అన్నారు. తాను ఎన్నో పబ్లిక్ మీటింగ్‌ల్లో ప్రసంగించినప్పటికీ, అటల్‌జీ లేని ఇలాంటి సమావేశంలో ప్రసంగించాల్సి వస్తుందని ఎన్నడూ అనుకోలేదని అద్వానీ ఆవేదన వ్యక్తం చేశారు. తాను రాసిన పుస్తకం (వాజ్‌పేయి ప్రస్తావనలు అందులో ఉన్నాయి) విడుదల కార్యాక్రమంలోనూ వాజ్‌పేయి పాల్గొనలేకపోవడం తననెంతో విచారానికి గురిచేసిందన్నారు. అటల్‌జీ నుంచి తానెన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నానని అడ్వాణీ తెలిపారు.

## మానవాళి మరువని మహానేత

దగ్గరుండి చూసిన వారు కానీ, దూరం నుంచి చూసిన వారు కానీ ఆయనను ఎంతగానో అభిమానించి, విశ్వసిస్తారని ఆయన గుర్తుచేసుకున్నారు. అటల్‌జీ నిజయమైన స్వయం సేవకుడని భాగవత్ ప్రశంసించారు.

వాజ్‌పేయి సంతాప సభలో ఆయన దత్తపుత్రిక నమిత భట్టాచార్య, మనుమరాలు నీహారికతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ, హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, యోగాగురు రాందేవ్ బాబా, జునాగఢ్ పీఠాధిపతి అవదేశానంద్ గిరి, కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, ఆనంద్ శర్మ, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ తదితరులు పాల్గొన్నారు.

## కేరళ ప్రజలకు నెల జీతం విరాళం

కేరళ ప్రజలకు విరాళంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కేజే ఆల్ఫోన్స్ మాట్లాడుతూ... ప్రస్తుతం కేరళ ప్రజలకు దుస్తులు, ఆహారం అవసరం లేదు. వారు ఇంతకు ముందులా జీవించడానికి వాళ్లకి ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్, కార్పెంటర్లు కావాలి. మనందరం కేరళ ప్రజలకు సహకరిద్దాం అని తెలిపారు.

***ముందుకొచ్చిన ఏఐఏడీఎంకే నేతలు:***

కేరళ ప్రజలకు ఆర్థిక సాయం అందించడంలో తమిళనాడు అధికార పార్టీ ఏఐఏడీఎంకే నేతలు కూడా ముందుకు వచ్చారు. కేరళ ప్రజల సహాయార్థం నెల జీతాలను సీఎం సహాయ నిధికి పంపనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పళని స్వామి తెలిపారు.

## భారీ వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

పాటు ఆస్తి నష్టం తగ్గించాలని సూచించారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అన్ని ప్రాంతాలలో లైఫ్ జాకెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు.

సంక్షోభాల్లోనే మన సామర్థ్యం బయటపడుతుందని, అధికారులు, సిబ్బంది సమన్వయంగా పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. అవనిగడ్డలో పాముకాట్లపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. అన్ని ఆసుపత్రులలో యాంటి వీనమ్ సీరమ్ నిల్వ ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం కీలక సమయమని, అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ, పోలీస్, విపత్తు నిర్వహణ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. బుట్టాయగూడెంలో వరదల్లో చిక్కుకున్న భక్తులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. భక్తులు అందరూ సురక్షితంగా ఉన్నారని. వారి వెంట పోలీసులు ఉన్నారని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ తెలిపారు. కొండవాగుల ఉధ్ధృతిపై కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. తప్పిపోయిన ఒక భక్తుడిని కూడా అగ్నిమాపక సిబ్బంది కాపాడారని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వరద బాధితులకు సహాయ శిబిరాలు ఏర్పాటు చేయాలని, బాధితులకు ఆహారం, మందులు పంపిణీ చేయాలని చంద్రబాబు అధికారులకు ఆదేశంచారు.

కేరళ వరద బాధితులకు పార్టీ అండగా ఉండాలి

కేరళ వరద బాధితులకు పార్టీ అండగా ఉండాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆపన్న హస్తం అందించడంలో ఆంధ్రులు సాటిలేరనిపించుకోవాలన్నారు. పార్టీ నుంచి ఇచ్చే విరాళంతో పాటుగా ప్రజాప్రతినిధులు కూడా విరాళాలివ్వాలన్నారు. ఎంపీ నిధుల నుంచి విపత్తు సాయం పద్దుకింద ఎంత ఇవ్వవచ్చో అంతా ఇవ్వాలని టీడీపీ ఎంపీ రవీంద్రకుమార్‌కు చంద్రబాబు సూచించారు.

## చంద్రబాబు పాలనలో రాష్ట్రం అప్పులపాలైంది

నిర్మాణం కేంద్రం సాయంతో చేయాల్సి ఉండగా.. వారితో పోరాడకుండా అప్పులు తీసుకురావడం సరికాదన్నారు. అప్పు చేసేందుకు సహాయపడిన బ్రోకరేజ్ సంస్థకు కమీషన్ కింద 0.85 శాతం ఇవ్వడం చోద్యంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, కేంద్ర ప్రభుత్వ గ్రాంటుతోనే సర్వాంగ సుందరమైన రాజధానిని నిర్మించి రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తామని తులసిరెడ్డి స్పష్టం చేశారు.

## జీవీయంసీ 48 వార్డులో కుట్టుమిషన్‌లపై శిక్షణపొందిన మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



గాజువాక: జీవీయంసీ 48వవార్డు ప్రకాశ్‌నగర్‌లో ఇటీవల కుట్టుమిషన్‌లో శిక్షణ పూర్తిచేసిన మహిళలకు కుట్టుమిషన్‌లను పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే పి.గణబాబు పంపిణీ చేసారు. సోమవారం మల్కాపురం ప్రకాశ్‌నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మిషన్లు ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే గణబాబు మట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెదేపా ప్రభుత్వం మహిళాభివృద్దికి ఎంతో కృషి చేస్తుందని అన్నారు. మహిళలు అన్నిరంగాలలో రాణించాలని, స్వయం ప్రతిపత్తి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కె.రాము, మజ్జిమాలినాయుడు, జోజిబాబు, మజ్జిశ్యామల కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### ప్రకృతి ప్రకోపం

కేరళ ప్రజలు వరద నీటిలో చిక్కుకొని ఆర్తనాదాలు చేస్తున్నారు. రాష్ట్రంలోని పద్నాలుగు జిల్లాల్లో పదమూడు వరద బీభత్సానికి విలవిలలాడుతున్నాయి. కేరళ రాష్ట్రమే జలమయమైంది. ఒకటి రెండు రోజుల్లోనే వంద మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నెలలో వరదల మూలం గా సుమారు 170 మంది మరణించినట్టు తెలుస్తున్నది. దాదాపు రెండున్నర లక్షల మంది సహాయ శిబిరాలలో తలదాచుకున్నారు. దవాఖానలు, సహాయ శిబిరాలలోకి కూడా వరదనీ రు వచ్చిచేరుతున్నది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సహాయ కార్యక్రమాలు చేపట్టడానికి కూడా వీలుకాని దయనీయ స్థితి నెలకొన్నది. త్రివిధ దళాలు రంగంలోకి దిగడంతో కొంతమే ర సహాయ కార్యక్రమాలు సాగుతున్నాయి. వందలాది మరపడవలతో సహాయ కార్యక్రమాల ను చేపడుతున్నారు. ఇండ్లలో చిక్కుకుపోయిన వారిని గుర్తించి నప్పటికీ, వారిని కాపాడలేని నిస్సహాయత ఆవరించింది. దాదాపు ఎనిమిది వేల కోట్ల రూపాయల పంట నష్టం జరిగిందని అంచనా. మౌలిక వసతులు కూడా దెబ్బతిన్నాయి. ప్రజలు కోల్పోయినదెంత అనేది లెక్కలకు అందనిది! 1924 తరువాత ఇంత భారీ వర్షాలు కురియడం ఇదే మొదటిసారి. వరదల పాలైన కేరళ రాష్ట్రాన్ని ఆదుకోవడం అందరి బాధ్యత. ఈ వరదల బాధ నుంచి ఉపశమనం పొందిన తరువాత, ఈ బీభత్సానికి కారణమేమిటి? ముందు జాగ్రత్త చర్యలు తీసుకొంటే ఈ జల ప్రళ యం తప్పేదా అనేది చర్చించుకోవడం అవసరం. డ్యామ్‌లలోని వీటిని కొద్దికొద్దిగా విడుదల చేయకుండా ఒకేసారి వదిలారనే విమర్శ వినబడుతున్నది. కానీ పర్యావరణ పరిరక్షణ విధానాలను నిర్లక్ష్యం చేయడం అసలు కారణమనే అభిప్రాయం కూడా బలంగా ఉన్నది. పశ్చిమ కనుమలు పర్యావరణ పరంగా అత్యంత సున్నితమైన ప్రాంతం. ఈ కనుమల ప్రాం తంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి ప్రముఖ పర్యావరణ వేత్త గాడ్గిల్ నేతృత్వంలోని కమిటీ 2011లో నివేదిక ఇచ్చింది. పశ్చిమ కనుమలలోని అనేక ప్రాంతాలను పర్యావరణ సున్నిత ప్రాంతాలుగా గాడ్గిల్ కమిటీ గుర్తించింది. లక్షా నలభై వేల కిలోమీటర్ల పొడవైన పశ్చిమ కనుమలను మూడు మండలాలుగా వర్గీకరించింది. ఈ మండల పరిరక్షణకు ఏయే చర్యలు తీసుకోవాలో సూచించింది. కొన్ని ప్రాంతాలలో గనుల తవ్వకం, కొండలు పగుల కొట్టడం, భారీ భవనాలు కట్టడం మొదలైన పర్యావరణానికి ముప్పు కలిగించే కార్యకలాపాలను నియంత్రించాలని గాడ్గిల్ కమిటీ సూచించింది. అటవీ ప్రాం తాన్ని ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని హితవు చెప్పింది. ఈ సూచనల పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. గాడ్గిల్ దిష్టిబొమ్మలను దగ్ధంచేసే స్థాయికి ఆందోళన చెలరేగిం ది. అయితే రైతుల భూములు పోతాయంటూ తప్పుడు ప్రచారం సాగడం వల్ల ఈ ఆందోళన తలెత్తిందనే అభిప్రాయం ఉన్నది. పర్యావరణానికి ప్రమాదం కలిగిస్తున్న గనుల తవ్వకం, ఇతర కార్యకలాపాలకు చెందిన లాబీలు ప్రజలను రెచ్చగొట్టాయనే ఆరోపణలు ఉన్నాయి. కేరళ ప్రభుత్వం గాడ్గి ల్ కమిటీ నివేదికను తిరస్కరించి కస్తూరి రంగన్ కమిటీని నియమించింది. ఈ కమిటీ పర్యావరణ సున్నిత ప్రాంతాలను కుదించింది. అయినప్పటికీ ఈ నివేదికపై కూడా వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో నాటి ముఖ్యమంత్రి ఉమన్ చాంది మరో కమిటీని వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు వివరించి గాడ్గిల్ కమిటీ సూచనలను అమలు చేస్తే ఇవాళ ఇంత విషాదం నెలకొనక పోయేది. కానీ ప్రజా ప్రతినిధులు బాధ్యతారహితంగా వ్యవహరించారు. స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ప్రకృతి వనరులను పరిరక్షించే ప్రాజెక్టులను చేపట్టాలని కూడా గాడ్గిల్ కమిటీ సూచించింది. కానీ దానిని కేరళ ప్రభుత్వం పట్టించుకోలేదు. కేరళలో పర్యాటక అభివృద్ధి పేరుతో కొండ ప్రాంతాలలో మత సంస్థలు, హోటళ్ళ పేర భారీ భవనాల నిర్మాణాన్ని అనుమతించారు. అడవులు నరకడం, గనుల తవ్వకం విచ్చల విడిగా సాగింది. దీంతో కొండ చర్యలు విరిగిపడుతున్నాయి. ఇప్పుడ కేరళ వరదలలో ప్రజలు చనిపోయింది ఎక్కువగా కొండ చరియలు విరిగిపడటం వల్లనే. మానవ కార్యకలాపాలు సాగే ప్రాంతాలలోనే బీభ త్సం ఎక్కువగా ఉన్నది. ఒక్క కేరళ రాష్ట్రమే కాదు, పశ్చిమ కనుమల ప్రాంతానికి అనుకుని ఆరు రాష్ట్రాలు ఉన్నాయి. ఈ ఆరింటిలో ఏ ఒక్క రాష్ట్రం కూడా గాడ్గిల్ కమిటీ సూచనలను అమలు చేయలేదు. పర్యావరణ పరిరక్షణ చర్యల పట్ల ఆసక్తి ప్రదర్శిం చడం లేదు. కేరళలో ప్రకృతి ప్రకోపానికి మరో కారణం కూడా ఉన్నది.

# ఈ నెల 26న భువనేశ్వరి అమ్మవారికి పాలపత్రితో ఆదివాసం



విశాఖపట్నం : సబ్బవరం మండలం, యాతపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో వెలసియున్న భువనేశ్వరి దేవి అమ్మవారికి ఈ నెల 26న 91వ ఆదివాస మహోత్సవాన్ని పాల పత్రితో నిర్వహించనున్నట్లు శ్రీ భువనేశ్వరీ దేవీ సంస్థాన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఓంకార రుషి తెలిపారు. ఈ నెల 26న అమ్మవారి దివ్య శిలా విగ్రహానికి పాల పత్రితో యథాతథంగా మంగళస్నానాలు, ఈ పాల పత్రితో ఆదివాస మహోత్సవంను నిర్వహిస్తామని తెలిపారు. ఇది 91వ ఆదివాసమని పేర్కొన్నారు. పాల పత్రి పెళ్ళిళ్లకు, శుభకార్యాలకు పెళ్లి రాట వేసేటప్పుడు మామిడికొమ్మ, పలకాల కొమ్మ, భరణికొమ్మతోపాటు పాలపత్రిని కట్టి శుభకార్యం జరిపిస్తారు. క్రిమిరోగం నివారణ అవుతుందని సమస్త రోగాలకు నయం చేకూర్చి దేహంలోని దుష్టద్రవ కూటమిని కరిగిస్తుంది. ఓంకార్ రుషి తెలిపారు. పాలపత్రి ఆకుతో భక్తులు పంచామృతాలు, చీర, కుంకుమ తెచ్చుకొని అమ్మవారికి సమర్పించి అమ్మ కృపకు పాత్రులు కాగలరని ఓంకార రుషి వివరించారు.

# నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలి

## జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్



విజయనగరం: నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని వాటిపై ప్రతి వారం సమీక్ష జరుగుతుందని జిల్లా కలెక్టర్ హరిజవ హర్‌లాల్ అన్నారు. సోమవారం మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాధాన్యతా రంగాలను గుర్తించి ఒక బృందాలుగా జిల్లా అధికారులను నియమించడం జరుగుతుందని అన్నారు.

గ్రీవెన్సు సెల్‌లో 96 దరఖాస్తులు వచ్చాయని, భూ సమస్యలు, వరదలు, పింఛన్లు ముఖాంశాలుగా ఉన్నాయి. వాటిని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి ఆదేవించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్‌2 జె.సీతారారావు, డిఆర్ఓ జె.వెంకటరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు....

## విద్యలనగరంలో 'ప్రేవేటు' దే రాజ్యం




విజయనగరం: విద్యలనగరంగా పేరుపొందిన విజయ నగరంలో ఇప్పలి వరకు ప్రభుత్వపరంగా ఆంధ్రా యూనివర్శిటీ, జెన్‌టియుల కేటాయింపులేకపోవడం సిగ్గుచేటని లోక్‌సత్తాపార్టీ యువసత్తా నియోజకవర్గ అధ్యక్షులు రొక్కం గురునాథం, కార్యదర్శి లెంక లక్ష్మణరావు ఆరోపించారు. స్థానిక తోటపాలెంలో సోమవారం ఒక ప్రేవేటుకళాశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ప్రతి మండలంలో ఒక జూనియర్ కళాశాల అవసరముందని అలాగే ప్రతి రెండు నియోజకవర్గాల్లో ప్రధాన ప్రాంతాల్లో డిగ్రి కళావాల ఆవశ్యకత ఉందని అన్నారు. ప్రేవేటు కళాశాలకు, యూనివర్శిటీలకు అనుమతులిచ్చిన ముఖ్యమంత్రి జెఎన్‌టియు, క్యాంపస్, ఎ.యు క్యాపంస్‌లను ఎందుకు యూనివర్శిటీలుగా ప్రకటించలేదని వారు ప్రశ్నించారు. విద్యలనగరంలో విద్యారంగమంతా ప్రేవేటు పరమైందని విచారం వ్యక్తంచేశారు. అధికార, ప్రతిపక్షనాయకుల చేతుల్లో విద్యావిధానం ఇక్కడ నడుస్తోందని ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయమై ఆలోచించాలని వారు కోరారు. ఈ సమావేశంలో యువసత్తా సమన్వయ కార్యదర్శి పి.ఎల్.ఎన్.రాజు, గౌరీశంకర్, ఇతర విద్యార్థిప్రతినిధులు రాజు, శ్రీనివాస్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గుజరాత్‌లో భీమిలి మత్స్యకారుడు మృతి



భీమునిపట్నం : బ్రతుకు తెరువు కోసం గుజరాత్ వెళ్ళి అక్కడ మృతి చెందిన మత్స్యకారుడు బడే పోలయ్యను భీమిలి గ్రామానికి పంపించమని మంత్రి గంటా తో చెప్పగా వెంటనే ఆయన స్పందించారని భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా.నూకరాజు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ భీమిలి ఎగువపేట కు చెందిన బడే పోలయ్య గత కొద్ది కాలం క్రితం బ్రతుకు తెరవు కోసం గుజరాత్ వెళ్ళినట్లు తెలిపారు. కాగా గుజరాత్ ,రాష్ట్రం హిరావళి పోర్టు లో బోటు లో వేటకు బయలుదేరి మధ్యలో గుండెల్లో నొప్పి రావడం తో ఆయనను ఆసుపత్రికి తరలించారని అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని అన్నారు . ఇక్కడ సరైన సంపద లేకపోవడంతో బ్రతుకు తెరవుకోసం వేరే దేశంనకు వెళ్ళి చాలా ఇబ్బందులు పడతున్నట్లు తెలిపారు. అయితే అక్కడ ప్రభుత్వం మృతదేహాన్ని ఇంతవరకు పంపించ లేదని ఈవిషయంపై మంత్రి గంటా శ్రీనివాసరావును కలిసి అధికారులతో మాట్లాడారని వెంటనే మృతదేహం వచ్చే ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. మంత్రి గంటా ని కలిసిన వారిలో ఎగువపేట గ్రామానికి చెందిన పైడిపిల్లి నర్సింగరావు, మట్టా దాసు,వాసుపల్లి గరగయ్య, కాసరపు నాగరాజు, కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో వరినాట్లు ముమ్మరం

రావికమతం: అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో వరి నాట్లు ఊపందుకున్నాయి. గడిచిన వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కల్యాణపులోవ జలాశయం కింద పూర్తి ఆయకట్టు 4484 ఎకరాలు కాగా ఏటా 3560 ఎకరాల్లో వరి సాగవుతుంది. సాగునీరు విడుదలతో జలాశయంలో ఆయకట్టు పది గ్రామాల పరిధిలో వరినాట్లు చాలా వరకు పూర్తి కావచ్చాయి.

## సమకవి సమయం

### ఊహల-పల్లకి

కల-కల-కల
కిల-కిల-కిల
కోకిలమ్మ కుహ; కుహ;లు చేశావె!
గల -గల -గల
గిల-గిల-గిల
గోదావరి నడకల్లా!
వోయిలు -వొలక బోసావె!
చల - చల- చల
చిల-చిల-చిల
వాన చినుకుల్లా!
వాలావే - నా ఒంటిపైనా!
...॥కల॥
జల-జల-జల
జిల-జిల-జిల
అంతర జాలం చూపించవే ఇకనైనా!
వేయనా!... తీయనా!
తియ్యనా!... వేయనా!
జమ చెయ్యినా!
నా ఆర్థిక లావాదేవీలు
నీ కుహ:రంలో
తేలనా!... ములగనా!
ములగనా!.. తేలనా!
తేలి - తేలి- ములగనా!
నీ నది నీటి మడుగులో
డల - డల - డల
డిల- డిల- డిల
డమరుకం మ్రోగించనా
నీ మదిలోనా! ...॥కల॥
బల - బల-బల
బిల-బిల-బిల
తిరిగానే - తిరిగానే నీ చుట్టూ బొంగరంలా!
ఓనాడు
పల - పల-పల
పిల- పిల- పిలా
నీ ఊహల- పల్లకిలో ఊగనా!
పిల్లన గ్రోవి మోగించనా! ఈనాడు ఇకపైనా! ...॥కల॥

...కవితా రచన
యల్:సిద్ధు
సెల్ నెం: 7702977293

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : దశమి ఉ.6.53; మూల రా.2.41; ఉ.వ.9.27ల 11.04; రా.వ.12.57ల 2.41.

మంగళవారం 21-08-2018

**మేషం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల ఓర్పు, నేర్పు వ్యవహరించ వలసివస్తుంది. భాగ స్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. **వృషభం** :రావల సిన ధనం సకాలంలో అందుట వలన పొదుపు దిశగా మీ ఆలోచన లుంటాయి. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు. **మిధునం** : కోర్టు వ్యవహారాలు, స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి అందుకు తగిన ప్రోత్సాహం లభిస్తాయి. బంధుమిత్రుల రాకపోకలు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుస్తుంది. వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ వ్యాపారులకు పురోభివృద్ధి. **కర్కాటకం** : స్త్రీలకు వాహనం నడుపుతున్నప్పుడు ఏకాగ్రత అవసరం. సోదరీ సోదరుల మధ్య అవగాహన కుదురుతుంది. బంధువుల కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసివస్తుంది. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. **సింహం** : బంధువుల నుంచి ఒత్తిడి, మొహమాటాలు ఎదుర్కొంటారు. ఎదుటి వారిని అతిగా విశ్వసించటం మంచిది కాదని గమనించండి.. **కన్య** : ని టు ఇంటర్వ్యూల్లో ఏకాగ్రత ముఖ్యం. ముఖ్యమైన వ్యవహారాల్లో ఎదుటివారిని సలహా అడగడం మంచిదని గమనించండి. మీ జీవిత భాగస్వామి సలహా పాటించి లబ్ధి పొందుతారు. **తుల** : మీ సామర్థ్యానికి ఆశించినంత ప్రతిఫలం లభిస్తుంది. స్త్రీలు దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొం టారు. **వృశ్చికం** : స్త్రీలు విలువైన వస్తువులు చేజార్చుకునే ఆస్కారం ఉంది. ఇళ్ల స్థలాలు, పొలాల అమ్మకంలో పునరాలోచన మంచిది. ఏజెంట్లకు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మినహా ఆర్థిక సంతృప్తిఉండదు. **ధనుస్సు** : పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. బంధు మిత్రులతో సఖ్యత నెలకొంటుంది. సోదరీ, సోదరులతో ఏకీభవించలేకపోతారు. **మకరం** :రాజకీయ నాయకులు సభలు, సమావేశాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. మీ సంతానం విద్య, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. వృత్తి, వ్యాపార రంగాల వారికి సదవ కాశాలు లభిస్తాయి. **కుంభం** : ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. వాతా ఎమవరణంలో మార్పు రైతులకు ఆందోళన కలిగిస్తుంది. వ్యవ సాయ, తోటల రంగాల వారికి వాతావరణం అనుకూలిస్తుంది. **మీనం** :వ్యాపారాభి వృద్ధికి అహ ర్నిలు శ్రమిస్తారు. ఖర్చులు, చెల్లింపులలో ఏకాగ్రత వహించండి. అర్థాంతరంగా నిలిపి వేసిన పునః ప్రారంభమవుతాయి.

## బట్లపూడి గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో వైద్య శిభిరం

అనకాపల్లి: మండలంలో బట్లపూడి గ్రామంలో ఉచితవైద్య శిబిరం జనసేన ఆధ్వర్యంలో జరిగింది. అనకాపల్లి జనసేన నాయకులు కొణతాల సీతారాం పర్యవేక్షణలో గ్రామములో డెంగ్యూ మలేరియా వంటి జ్వరాలపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ అనూష శ్రీ సద్గురు మెడికల్ సెంటర్ గణేష్ రక్తపరీక్షలు చేశారు.అనంతరం ఉచిత మందుల పంపిణీ ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామంలో ఉన్న పేద ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పోల్నాటి ఇంటికి నేతల తాకిడి

అనకాపల్లి: సీనియర్ తెలుగుదేశంపార్టీ నాయకులు మాజీ జెడ్పీటీసీ జిల్లా తెలుగురైతు కార్యదర్సి పోల్నాటి అప్పారావు నివాసానికి నేతలు తాకిడి తగిలింది. అనకాపల్లి పవన్‌సిటీ సెంటర్‌లో ఉన్న తన నివాసంలో తన మనవరాలు జ్ఞానవేణి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికులతో పాటు, వివిద ప్రాంతాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ముఖ్యంగా మాజీ మంత్రి దాడివీరభద్రారవు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, అవంతిమహేష్, పరుచూరి భాస్కరరావు, డాక్టర్ నారాయణరావు, ఎంపిటీసీ సలాది చంద్రవతి, కోట్ని అయ్యన్న దొర, గొన్నాబత్తుల రమణ, గుత్తా ప్రభాకర చౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్‌బి క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రధానం

అనకాపల్లి: ఎస్‌ఆర్‌బి సంస్థ చైర్మన్ కొణతాల సీతారాం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో 15 రోజులుగా జరుగుతున్న ఎస్‌ఆర్‌బి క్రికెట్ కప్‌లో పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం. ఆదివారం ఉత్కంఠ పరితంగా పోటీలు జరిగాయి. అందులో ఎన్టీఆర్ స్టేడియం, భీమునిగుమ్మం జట్లు మధ్య ఫైనల్ పోటీ జరిగింది. ఈపోటీలో ఎన్టీఆర్ గ్రౌండ్ జట్టు విజయం సాధించింది. కప్పు కైవసం చేసుకుంది. ఎస్‌ఆర్‌బి అధినేత, జనసేన నియోజకవర్గ నేత కొణతాల సీతారాం విజేతలకు బహుమతులు అందజేసారు. ప్రధమ, ద్వితీయ జట్లకు 30,వేలు, 20వేలు అందజేసారు. బెస్ట్ బ్యాచ్‌మేన్‌గా నానీ, మ్యాన్‌ఆఫ్‌ది సీరిస్‌గా గౌరీ, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌గా బాను,లు నిలిచారు. ఈ కార్యక్రమంలో దాడి బుజ్జి, వాకాడ సతీష్, కర్రి రుద్రి, ప్రతాప్, బాలాజీ, ప్రభాకర్, నర్సింగరావు పాల్గొన్నారు.

## ప్రజాసాధికార సర్వేలో నమోదైతేనే సంక్షేమ పథకాలు

రోలుగుంట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ప్రజాసాధికార సర్వేలో నమోదు కావాలని తహశీల్దార్ పెంటకోట అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వేలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలు ఫొటోలు, వేలిముద్రలు ఇంటి ఫొటోలు తీసుకొని నమోదు చేశారని, అయితే అనేక మంది ఆ సమయంలో దూర ప్రాంతాలకు వెళ్లడంతో సర్వేలో నమోదు కాలేదన్నారు. అటువంటి వారు తహశీల్దార్ కార్యాలయంలోని ప్రజాసాధికార కౌంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

## పేదలకు సిఎం రీలిజ్ ఫండ్ పంపిణీ

అనకాపల్లి : పట్టణంలో ఎమ్మెల్యే కార్యాలయంలో స్థోమత లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి నిధినుండి చెక్కులను పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర అందజేసారు. వైద్య సహాయ నిమిత్తం ఈచెక్కుల పంపిణీ జరిగింది. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ కాకర్ల రమణ, భీశెట్టి మనోహర్‌లకు 2 లక్షల రూపాయలు చెక్కులను అందజేసినట్లు తెలిపారు. శాసన సభ్యులు పీలా గోవింధసత్యనారాయణ సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యేకు ఈ సందర్బంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈసంధర్బంగా బుద్ద శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవం

రావులపాలెం: ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రావులపాలెం ది ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ & వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా ఫొటోగ్రఫి పితామహులు లూయిన్ డాగురే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్వర్గీయ కళా వెంకట్రావు, వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా యూనియన్ అధ్యక్షులు గుబ్బల వెంకటరమణ, మాజీ అధ్యక్షులు నల్లమిల్లి రామారెడ్డి మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ రాత్రనక, పగలనక కష్టించి పనిచేసే తత్వం గల వ్యక్తులని, గతాన్ని వర్తమానంగా చేసి భవిష్యత్తు వరకు తీసుకువెళ్ళి చూపించగలిగే అద్భుత శక్తి ఒక్క ఫొటోగ్రాఫర్స్‌కే ఉందన్నారు.

## ముంపు గ్రామాలను పరిశీలించిన ఎమ్మెల్యే

అమలాపురం : రూరల్ మండలం ఇందుపల్లి, బండారులంక గ్రామాల్లో వరద మంపు ప్రాంతాలను అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు సోమవారం పరిశీలించించారు.మంపు గ్రామాల బాధితులను పరామర్శించారు. ఇందులో బాగంగా ఇందుపల్లి, బండారులంక అప్పర్‌కౌసిక ఇరువైపుల గల ఏర్పాడిన గండ్లను తక్షణం మరమత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు.వరధ ఉదృతం అయితే ముంపుగ్రామాల ప్రజలకు కావలసిన ఏర్పాట్లను చేయాలని జాయింట్ కలక్టర్ తో మట్లాడి అధికారులకు ఎమ్మెల్యే ఆదేసించారు. ఇందుపల్లిలో మంపుకు గురైన జాంబౌవారి పేట,గరువు, జల్లివారిపేట,బొంతువారిపేటతోపాటు, పటు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు ఎం.ఆర్‌ఓ బేబి జ్నానాంభ, ఎండిఓ శారారాణి. ఎంపిపి యరుబండ వెంకటేశ్వ్రరావు, జెడ్‌పిటిసి అధికారి జయ వెంకటలక్ష్మిబాబ్జి, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు,అమలాపురం రూరల్ ఎస్సై గజేంద్ర కుమార్ యిరిగేషన్ ఏఇ శివరామకృష్ణ, బండారులంక మాజీ సర్పంచ్ బడుగు సత్యనారాయణ,మాడా మాధవి,బొంతు ప్రకాష్ తదితరలు పాల్గోన్నారు.

## పేద విద్యార్ధులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ

రావులపాలెం: అహర్నిశలు పేదల సేవలో ఉండే అనూస్ స్వచ్చంద సంస్థ సభ్యులు మరో ముందడుగు వేసి తనదైన శైలిలో వరద ముంపు బాదితలకు సేవలనందించారు. రావులపాలెం ముంపు ప్రాంతాల్లో పడాల రామకృష్ణారెడ్డి తన సంస్థ సభ్యులతో పర్యటించారు. విద్యార్ధులకుపలకలు, పుస్తకాలు పంపిణీ చేసారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

### టీడీపీ ఇన్‌ఛార్జి బండారు అప్పలనాయుడు



పరవాడ: మండలకేంద్రమైనపరవాడకొత్త కోలనీ సిసిరోడ్లు, డ్రైయిన్లు నిమిత్తము ఎన్ అర్ జియస్ నిదులు మరియు మైనింగ్ గ్రాంట్ నుండి ముప్పై లక్షలు రూపాయలును స్దానిక శాసనసభ్యులు బండారుసత్యనారాయణమూర్తి మంజూరు చేసారు. ఈపనులనుసోమవారము పెందుర్తిటిడిపి ఇనచార్జి బండారు అప్పలనాయుడు,జిల్లాప్రాదేశిక సభ్యులు పైలజగన్నాదరావు, ఎంపిపి మాసవరపుఅప్పలనాయుడు చేతులు మీదగా ప్రారంబించారం.అనంతరముఅతిధి లుమాట్లడుతూ గ్రామాలఅబివృద్ది ఒకతెలుగుదేశంపార్టితథ్యమని,రానున్న ఎన్నికల్లో మరలతెలుగుదేశంపార్టిఅదికారంలోకిరావడముతద్యమని ఈసందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలోమండలటిడిపి ప్రెసిడెంట్ బొండా సన్నిదేముడు, మండలప్రదానకార్యదర్శిపైల రామ చంద్రరావు, జన్మభూమికమిటిమెంబర్ రెడ్డిశ్రీనువాసురావు, ఇందలకొండలరావు, బండారు సత్యనారాయణ, రాజానసత్యం, చుక్క సన్యాశిరావు, గణపర్తి ఈశ్వరావు,రెడ్డిచిన్నా,బొద్దపు అయ్యబాబు,గండిమహేష్, పైలనాయుడుస్వామి,పోతలబుజ్జి మరియు అదిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళలో నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలి



అచ్యుతాపురం: ఇళ్ళలో, పరిసరాల చుట్టూ నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, లేని పక్షంలో దోమలు వృద్ధి చెంది ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయని ఎంపీపీ రాజాన రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బలరాముడు, వైద్యాధికారిణి కనకమహాలక్ష్మి, ఎంఇవో దేవ రాయల్, మాజీ సర్పంచ్ లాలం నాగేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు పి.ఎరుకునాయుడు, అప్పారావు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## పచ్చ ధనంతో సంపుర్ణ ఆరోగ్యం

### ఇంటలిజెన్స్ రీజనల్ అదికారి రవిప్రకాష్ ....

కంచరపాలెం : పచ్చ ధనం పెంపొందించడం వలన సంపుర్ణ ఆరోగ్యం చేకురుతుందని ఇంటలిజెన్స్ రిజనల్ అదికారి రవిప్రకాష్ పేర్కొన్నారు . ఈమేరకు కంచరపాలెం వద్ద నున్న ఎస్సి,ఎస్టి బాయ్స్ కలశాల హాస్టల్ ప్రాంగణంలో సోమవారం ఉదయం వివిద మొక్కలను ఆయన నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత ఆంద్ర ప్రదేశ్ నిర్మాణం లక్షంగా ఆంద్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన వనం -మనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావలని పిలుపునిచ్చారు . మనం నాటిన ప్రతి మొక్క బావితరాలకు ఉపయోగ పడేవిధంగా ఉండాలనే ఉద్దేశంతో పళజాతి మొక్కలను నాటడం జరిగిందన్నారు . కార్యక్రమంలో ఇంటలిజెన్స్ డిఎస్పి ఎస్ .అప్పలనాయుడు , సి.ఐ ఎస్ .అప్పలరాజు , ఇనస్పెక్టర్ మహమ్మద్ సనావుల్లా , హస్టల్ వార్డెన్ సీతారాం పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం



భీమునిపట్నం : భీమిలి గంటా క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ ఇన్చార్జి విజయ్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరుల అభివృద్ధికి గౌరవ మంత్రివర్యులు గ్రంటా శ్రీనివాసరావు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తున్నారని వారి యొక్క సమస్యలపై దృష్టి సారించి ముస్లింలకు అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నెల 28 న గుంటూరు జరగబోయే నారా హమారా టిడిపి హమారా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. సమన్వయ కమిటీ సమావేశంలో కేరళలో వరద బాధితులకు సహాయం కోసం, నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరుల సాధికారత కోసం, నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి మరియు చేపట్టవలసిన పనుల గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అప్పలనరసిహరాజు, మాజీ వుడా చైర్మన్ ఏ ఆర్ రెహమాన్, ఏఎంసీ చె%ర్మన్ కోరాడ నాగభూషణరావు, భీమిలి మండల ఎంపీపీ యర బాల కృష్ణ వేణి అనిల్ ప్రసాద్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షు రాలు కురిమిన లీలావతి, భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా.నూకరాజు, ముస్లిం సోదరులు, పార్టీ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భూగర్భ విద్యుద్దీకరణ ప్రాజెక్టు పనులను పరిశీలించిన

### ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా శోభ హైమావతి



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విశాఖ నగరంలో జరుగుతున్న భూగర్భ కేబుల్ వ్యవస్థ పనులను ఏపీఈపీడీసీఎల్ మహిళా డైరెక్టర్ శోభా హైమావతి పరిశీలించారు.

ప్రపంచ బ్యాంకు నిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా ఏపీఈపీడీసీఎల్ ఏర్పాటు చేస్తున్న భూగర్భ కేబుల్ వ్యవస్థ పనులను పరిశీలించిన శోభా హైమావతి పాండు రంగపురం సబ్‌స్టేషన్ పరిధిలో బీచ్‌రోడ్డులో జరుగుతున్న భూగర్భ కేబుల్ వ్యవస్థ విశేషాలను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.రమేష్ ప్రసాద్ వివరించారు.

ఇందులో భాగంగా భూగర్భ కేబుల్‌వ్యవస్థకు ఉపయోగిస్తున్న కేబుల్స్‌ను, రింగ్ మెయిన్ యూనిట్స్‌ను పరిశీలించారు.

ఏపీఈపీడీసీఎల్ జిఎం జి.చిరంజీవిరావు, డీఈలు రామకృష్ణ, జనార్ధనరావు, సురేఖ, ఏడిఈలు, ఎల్&టి కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రసాంకేతిక అభివృద్ధి పితామహుడు రాజీవ్‌గాంధీ

### పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు



విశాఖపట్నం : శాస్త్రసాంకేతిక అభివృద్ధి పితామహుడు రాజీవ్‌గాంధీ అని ద్రోణంరాజు అన్నారు. మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సోమవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు పూలమాలవు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు మాట్లాడుతూ భారత దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ అని అన్నారు. నేడు మనం ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్ గాని, ఇంటర్నెట్ వంటి సాంకేతిక ఉపకరణాలు ఉపయోగిస్తున్నామంటే రాజీవ్ గాంధీయే కారణమని అన్నారు. శాస్త్రసాంకేతిక రంగా లను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని అగ్ర స్థాయిలో నిలబెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. వినియోగదారుల హక్కు చట్టం, లోక్ అదాలత్, 18 సంవత్స రాలకే ఓటు హక్కు కల్పించి ఈ దేశ ప్రజల హృద యాలలో చిరస్థాయిగా నిలిచి పోయా రని అన్నారు. ప్రధానిగా ఆయన చేసిన సంస్కరణలు మరిచిపోలే నివని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు రాజీవ్ గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. రాజీవ్‌గాంధీకి విశాఖ నగరానకి మరిచిపోలేని అనుబంధం ఉందని అన్నారు. ఆయన చివరి మజిలి విశాఖనగరం కావడం గొప్ప విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం సత్యనారాయణరాజు, గుత్తుల శ్రీనివాస్, లీగల్ సెల్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాస్, గొంపా గోవింద్, కె.తాతారావు, లింగం శ్రీనివాస్, కర్రి రామారెడ్డి, యర్రంశెట్టి శ్రీనివాస్, జగన్, మధు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాచ్ హౌస్ వద్ద, బీచ్ రోడ్డులోనూ ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

# ఈనెల 23న జ్ఞానభేరి


### - ముఖ్య అతిధిగా హాజరవుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
### - రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం: దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ మృతికి సంతాపాన్ని ప్రకటిస్తూ వాయిదా వేసిన జ్ఞానభేరి కార్యక్రమాన్ని ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం ఆంధ్ర విశ్వ విద్యాలయం సెనేట్ హాల్‌లో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిర్వహణకు జిల్లాకు రూ.10కోట్లు విడుదల చేశామన్నారు. ఈ నిధులను వెచ్చిస్తూ ఎంతో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలు మంత్రులు, ప్రముఖులు, మేధావులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంచి ప్రతిభ కనబరిచే విద్యార్థులకు వెయిటేజ్ మార్కులు ఇవ్వాలనే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ జ్ఞానభేరి కార్యక్రమం విద్యార్థుల భవితకు దశదిశ నిర్ధేశిస్తుందని, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించుకునే విధంగా విద్యార్థుల్లో మంచి ఆలోచనలను ప్రేరేపిస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జ్ఞానభేరి పోస్టర్, ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి జి.నాగేశ్వరరావు, కె.గాయిత్రి, కె.నిరంజన్, సెంచూరియన్ యూనివర్శిటీ ఉపకులపతి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్‌లో బాబు జోక్యం

### - యరపతినేని హస్తం... లీకేజీలపై సమాధానమేంటి?
### - వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారు - వైకాపా నేత బొత్స సత్యనారాయణ



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న అక్రమ మైనింగ్‌లో ఏపీ సీఎం చంద్రబాబు నాయడు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హస్తం ఉందని వైఎస్సార్ సీపీ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గుంటూరు జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై సీబీఐ విచారణ జరిపించాలని బొత్సా సవాలు విసిరారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు సచివాలయంలో లీకేజీలపై ప్రభుత్వ సమాధానమేంటని బొత్సా నిలదీశారు.

**కొండను తవ్వి...ఎలుకను పట్టినట్లు**

అక్రమ మైనింగ్‌లో అసలు దోషులను కాపాడుతూ కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు అధికారులకు ప్రభుత్వం నోటీసు లివ్వడం సిగ్గుచేటని బొత్సా సత్యనారాయణ విమర్శించారు. ఈ ఒక్క విషయంతోనే ప్రజాధనాన్ని టీడీపీ ప్రభుత్వం ఎంతలా దోచుకుంటుందో ప్రజలకు స్పష్టంగా అర్థమయిందని బొత్సా వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో గనుల దోపిడీ విషయమై కేసును సీఐడీకి అప్పగించడాన్ని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ట్విట్టర్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో తప్పు బట్టారు.

**వాస్తవాలను...కప్పిపుచ్చేందుకే!**

వాస్తవాలను కప్పి పుచ్చడం కోసమే ఆ కేసును సీఐడీకి అప్పగించారని జగన్ తన ప్రకటనలో ఆరోపించారు. అసలైన దోషులను రక్షించడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని.. తన చేతిలోని దర్యాప్తు సంస్థ ద్వారా పెద్ద తప్పును చిన్నదిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విపక్ష నేత తెలిపారు. పల్నాడు గనుల దోపిడీపై సీబీఐ విచారణకు సిద్ధమా అంటూ ఆయన సీఎం చంద్రబాబు నాయుడికి సవాల్ విసిరిన నేపథ్యంలో జగన్ సవాలును బొత్సా పునరుద్ఘాటించారు. మరోవైపు రాష్ట్రంలో గతకొద్ది రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఆంధ్రప్రదేశ్ అతలాకుతలమవుతోందని బొత్స చెప్పారు. వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని... వరద ప్రాంతాల్లో ప్రభుత్వం సహాయక చర్యలు పెంచాలని ఆయన సూచించారు. ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించాలని ప్రభుత్వాన్ని బొత్సా కోరారు. ఉత్తరాంధ్రలో విషజ్వరాలు ప్రబలుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బొత్సా ఆరోపించారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు సచివాలయంలో లీకేజీలపై ప్రభుత్వ సమాధానమేంటని బొత్సా నిలదీశారు. గతంలో లీకేజీల గురించి ప్రస్తావిస్తే ప్రతిపక్షమే విమర్శిస్తుందే తప్పా అసలు ఏంలేదని చెప్పిన ప్రభుత్వం... ఇప్పుడు సచివాలయం లీకేజీలపై సమాధానం చెప్పాలని బొత్సా డిమాండ్ చేశారు.

## ప్రత్యేకత కన్పించాలని పనిచేయండి

### జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్

విజయనగరం: ఉద్యోగులు పనిచేసేటప్పుడు ఒక ప్రత్యేకత కన్పించాలని జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల& అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుండి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. ఏ పనిచేసినా ప్రత్యేకత కన్పించే విధంగా జిల్లాకు ప్రత్యేకత తీసుకొచ్చే విధంగా పనిచేయాలన్నారు. పథకాల అమలులో కార్యాలయాలు శుభ్రంగా ఉంచడంలో, మొక్కలు నాటడంలో ప్రతీ విషయంలో కొత్తదనం తీసుకురావాలని అన్నారు. జిల్లాలో వర్షాలు ఎక్కువ పడుతుండడం వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలను చైతన్య వంతులను చేసివర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిం చాలని పేర్కొన్నారు. ప్రజలు తాగేనీరు వేడిచేసుకుని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరారు. గృహ నిర్మాణాల విషయం మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రావలసిన నగదు అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, బి.సి లబ్దిదారుల వివరాలను ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన తెలిపారు. పంచాయితీ రెవిన్యూ వసూళ్ళు జరిగే విధంగా చర్యలు గైకొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.సి.-2 జె. సీతారామారావు, డిఆర్ఓ జె.వెంకటరావు తదితర అధికారులు పాల్గొన్నారు.



వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నగర కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పత్రిక సమావేశం జరగింది . ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు శ్రీ కె.కె రాజు , రాష్ట్ర కార్యదర్శి శ్రీ రొంగాలి జగన్నాధం , ఎస్.చంద్ర మౌలి, అనుబంధ విభాగం అధ్యక్షులు శ్రీమతి పిలా వెంకటలక్ష్మి , శ్రీమతి గరికన గౌరీ , బి.కాంత రావు, టి సురేష్ , బర్కత్ అలీ, బోని.శివరామకృష్ణ, రాధ , ప్రస్.వాస్, ఆనంద, బాకి.శ్యాం కుమార్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బాబి రెడ్డి , శ్రీ పోలి రెడ్డి , రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి రవి కుమార్ , రాష్ట్ర మహిళ విభాగం అధికార ప్రతినిధి యువశ్రీ , నగర కార్యదర్శి పితల మహేష్ పాల్గొన్నారు.

## 24 నుండి రాష్ట్రస్దాయి హ్యాండ్ బాల్ పోటీలు

### కమిటీ ఛైర్మన్‌గా సురేంద్ర

అనకాపల్లి : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో రాష్ట్ర స్దాయి జూనియర్ బాలికల అంతర్‌జిల్లాల హ్యాండ్‌బాల్ ఎమ్మెల్యే కప్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, కమిటీ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. స్దానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 జిల్లాల నుండి బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రతీ రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు పోటీలు జరుగుతాయన్నారు. 13 జిల్లాల నుండి, క్రీడాకారులతోపాటు 20 మందికి పైగా న్యాయనిర్ణేతలు పాల్గొం టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడా అభిమానలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ముఖ్య అతిధిగా శాఫ్ కమీషనర్ బంగారురాజు, జీవిఎంసీ మెయిన్ కమీషనర్ హరినారాయణ ఆర్డీవో సూర్యకళ, పాల్గొంటారని చెప్పారు. అబ్జర్‌వర్‌గా స్పోర్ట్స్ డిప్యూటి డైరెక్టర్ పాల్గొంటాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ రాము, జిల్లా హ్యాండ్ బాల్ అసోషియేషన్ అధ్యక్షులు సుందరపు విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కెఎన్‌వి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## 24న యలమంచిలిలో రైతు ఆత్మయసభ

యలమంచిలి రూరల్ : రైతు సమస్యలు తెలుసుకోవడానికి వైసిపి అధ్యక్షులు జగన్మోహనరెడ్డి ఈ నెల 24న యలమంచిలిలో రైతు ఆత్మీయసభ నిర్వహిస్తున్నట్లు యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కన్నబాబురాజు తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24వతేదీన కోటవుట్ల నుంచి యలమంచిలి నియోజకవర్గంలోకి జగన్ పాదయాత్ర చేరు తుందన్నారు. యలమంచిలిలో బహిరంగ సభ అనంతరం రైతుల సమస్యలు తెలుసుకునేందుకు ఆత్మీయసభ నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు భారీ ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

### బాలల విరాళాలు సేకరణ

భీమునిపట్నం : కేరళ వరద బాధితుల కోసం భీమిలి మండలం లోని మంగమారిపేట గ్రామంలోని బాలలు విరాళాలు సేకరిం చారు. ఇటీవలే కురుస్తున్న భారీ వర్షాలకు కేరళ అతలాకుతలం అవ్వడం టీవీలలో చూసి ఆ పసి హృదయాలు కలచివేసాయి.

**IN THE HONOURABLE COURT OF THE 1 ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**
**IA 129/2016 IN IA 728/2013 IN O.S.765/2011**

**Between:**
**Yennamaneni Venkateswara Rao ...Plaintiff**
**And:**
**Chinni Krishna Murthy ...Defendent**

**NOTICE**

**To**
**Chinni Krishna Murthy,**
**S/o. Narayana Rao, R/at Tummapala Kothuru,**
**Anakapalli, Visakhapatnam**
**Presently**
**R/at D.No.45-43-19A, Flat No. FF1**
**Kamala Devi Apartment,**
**Srinivasa Nagar, Akkayyapalem,**
**Visakhapatnam-16.**

Please take notice that the above named petitioner/ Plaintiff has instituted the above case against you and the same stands posted to **1-10-2018** for your appearance, on that day at **10-30 A.M.** you should appear before the aforesaid Honourable Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte.

**N.V.V.Prasad**
**N.Sankara Rao**
**Adovocate**
**Visakhapatnam**
**Cell : 9989721260**

# ఉధృతమవుతున్న గోదావరి



యానాం: వృద్ధ గౌతమి గోదావరిలో వరద ఉధృతమవ్వడంతో వరద బాధితులు ఆందోళనకు గురువుతున్నారు. సోమవారం ఉదయం వరద 2.9 అడుగులకు వరదనీరు చేరడంతో నిరాశయులు పునరావాస కేంద్రానికి పరిమితమయ్యారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు దవళేశ్వరంవద్ద వరదనీరు 14 అడుగులకు చేరడంతో మంగళవారం రాత్రికి వరద మరింత పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ అధికార్లు తెలిపారు. పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు మున్సిపల్ కమీషనర్ జిగౌరీసరోజ, ప్రజాపనుల శాఖ ఇఇ రాందాసులు ముప్పుకు గురైన రాజీవ్‌గాంధీ బీచ్, ఫెర్రీరోడ్డు, వీరభద్రకాలనీ, కోనావెంకటరత్నం కాలనీ, ఓల్డ్‌రాజీవ్ నగర్, ఆడపడుచుల కాలనీ, ప్రాంతాలను పరిశీలించి నిరాశులయులైన బాధితులకు పునరావాస కేంద్రలలో కల్పిస్తున్న వసతులపై ఆరా తీసారు. అంటువ్యాధులు ప్రభలుతున్న ప్రాంతాలలోని ముందుజాగ్రత్తలు తీసుకోవాలని వైద్యఅధికారులకు సూచించి ఓల్డ్‌రాజీవ్‌నగర్, కనకాలపేటలో డెంగ్యువ్యాధి ప్రభలే అవకాశం ఉందని ముందు జాగ్రత్తగా ఆయుర్వేదంలో మందులను అక్కడ పంపణీ చేశారు. ప్రజలు వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకొని ముప్పుప్రాంతాలలోఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని సూచించారు. ఎవరికైనా ఎటువంటి సౌకర్యం కావాలన్నా ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని ప్రజలకు సూచించారు. అలాగే చేపలవేటకు ఎవరూ వెళ్ళకూడదని అధికారులు చెప్పేవరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. వరద ఉధృతివలన బాధితులు రాత్రులు ప్రయాణంచేయకూడదన్నారు. ముప్పు ప్రాంతాలలో పోలీసు, మత్స్య, రెవెన్యూ, మున్సిపల్ అధికారులను నియమించారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంను పురష్కరించుకొని శంఖవరం మండలం ఫోటోగ్రాఫర్స్ మరియు వీడియోగ్రాఫర్స్ ఆద్వర్యంలో ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అధ్యక్షుడు షేక్ గౌస్ అధ్యక్షత వహించగా అన్నవరం ఫోటోగ్రఫీ అధ్యక్షుడు బి.విజయ్ కృపానందకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ రోజుల్లో ఫోటోగ్రాఫర్స్ పరిస్దితి దుర్భరంగా ఉందని కావున ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని, అలాగే ఫోటోగ్రాఫర్స్‌కి తగిన సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ రోడ్డు నుండి బైపాస్ వరకు ర్యాలీ నిర్వహించారు.

అనంతరం గ్రామ శివారున ఉన్న శాంతివర్ధన మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఫోటో గ్రాఫర్స్ అధ్యక్షుడు బి.విజయ్ కృపానంద కుమార్, కార్యదర్శి గుల్లా.శ్రీకాంత్, కోశాధికారి దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ జి.కిరణ్ కుమార్, జాయింట్ సెక్రటరీ పి.షణ్ముకి బుల్లి, జాయింట్ కోశాధికారి కొల్లు.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ కౌన్సిలింగ్‌కు విశేషస్పందన

పెద్దాపురం: గత కొంతకాలంనుండి పెద్దాపురం పోలీస్ స్టేషన్లో ప్రతిఆదివారం నిర్వహిస్తున్న ఫ్యామిలీ కౌన్సిలింగ్‌కు విశేష స్పందన రావడం జరుగుచున్నది. అవగాహన లోపం వలన, నిరక్షరాస్యత వలన, కుటుంబంలో భార్యాభర్తల మధ్య వస్తున్న గొడవల వలన కుటుంబాలు, నిరంతరం నిరాశతో జీవిస్తున్నాయి. దీనికితోడు వారి సంతానం అనాధలుగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. విద్యావంతులు, ఉద్యోగస్తులలో కూడా తమకు పుట్టిన పిల్లల గురించి కూడా ఆలోచించకుండ ఆదిపత్యం కొరకు సంసార జీవితానికి దూరం కావడం జరుగుచున్నది. ఈ నేపథ్యంలో పెద్దాపురం డిఎస్పి సిహెచ్ రామారావు, సిఐ వైఆర్‌కే. శ్రీనివాసరావు, ఎస్ఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పెద్దాపురం పోలీస్‌స్టేషన్లో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న భార్యభర్తల అవగాహన సమస్యల పరిష్కారం కాపురాలకు రక్షణ కలిగించే విధంగా హామీ ఇవ్వడంతో ఫ్యామిలీ కౌన్సిలింగఎకు భార్యభర్తలు, తమ పిల్లలు, కుటుంబ సభ్యులతో భారీగా తరలివస్తున్నారు. జిల్లా మానవహక్కుల నేత నూతలపాటు అప్పకొండ, నూతులపాటి ఫణిశ్రీ, ఎస్ఐ భగవన్ ఈ సమావేశంలో పాల్గొని సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ ఫ్యామిలీ కౌన్సిలింగు నిరంతరం కొనసాగుతుందని కుటుంబ బాధితులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సిఐ వైఆర్‌కె. శ్రీనివాస్ కోరారు.

# ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు



విశాఖపట్నం : దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ శక్తి సంఘటన్ నగర అధ్యక్షుడు కె.గోపాల్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సోమవారం 31, 33 వార్డుల కూడలిలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌అదాలత్, వినియోగదారుల హక్కు చట్టం వంటి ఎన్నో సంస్కరణలు చేసి చిరస్మరణీయంగా ప్రజల హృదయాలలో నిలిచిపోయారని అటువంటి నాయకుడి విగ్రహం ఈ ప్రాంతంలో ఉండటం ఆనందదాయకమని అన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి దేశ పాలకుల నిర్ణయాత్మకంలో యువతను భాగస్వాములు చేశారని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి పరిచి ప్రపంచంలోనే భారతదేశాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లి దేశం గర్వించదగ్గ నాయకుడిగా ఖ్యాతి పొందారన్నారు. కార్యక్రమంలో 33వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు పోలారావు, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంటపొలాలోకి వరద నీరు

తాళ్లరేవు: వరదల కారణంగా తాళ్లరేవు మండలంలో పంటపొలాలోకి వరదనీరు చేరడంతో నీట మునిగాయి. తాళ్లరేవు మండలంలోని పిల్లంక, ఇంజురం, లోవలంక, చింతాకుల వారిపేట, లచ్చిపాలెం ప్రాంతాలలో వేలాది ఎకరాలలో వరి దుబ్బులు పీకలలోతు నీటిలో మునిగిపోవడంతో కుళ్ళిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గోదావరిలో వరదనీరు తగ్గుముఖం పడితేకాని నీరు దిగే అవకాశం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరి పొలాలు దెబ్బతింటాయన్నారు. పిల్లంక నుండి అరటికాయలంక ఉన్న మురుగుకాల్వ నీటితో స్థంభించిపోయింది. నీట మునిగిన వరిపోలాలను వ్యవసాయ అధికారిణి ఎ. సిరి, విఆర్‌ఒలు రాధాకృష్ణ, వాసంసెట్టి ఏడుకొండలు పరిశీలించారు. ఆదివారం కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లవారుజాము నుండి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తుండటంతో నీలపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలల్లో ఉన్న వీధులన్నీ నీటమునిగాయి. ఈ ప్రదేశాలను తాళ్లరేవు ఎంఆర్‌వో లోధాజోసప్, ఆర్ఐ కేశవవర్మ, విఆర్‌ఒలు ముప్పుప్రాంతాలను పరిశీలించారు.

# కేరళ వరద బాధితులకు ఆర్థిక సహాయం



యానాం: కేరళాలో సంభవించిన జలప్రళయ బాధితులకు యానాం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు చేతులమీదుగా కేరళ వదరబాధితల సహాయనిధికి అందచేసినట్లు ఆసోసియేషన్ అధ్యక్షులు ఎస్. అహ్మద్ తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సవ సందర్భంగా యానాం ప్రొఫెషనల్ ఫొటో మరియు వీడియో గ్రాఫర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ సభ్యులు భారీ వరదలతో అతలాకుతలమైన కేరళ రాష్ట్ర వరద బాధితులకు సహాయం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఎండి. ఖరీమ్, జిల్లా మెంబర్ బద్రి, ఉపాధ్యక్షులు సొల్లంగి హనుమంతురావు, జాయింట్ సెక్రటరీ రాము, పట్నాల హరి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# సంతాపసభ

పెద్దాపురం: పెద్దాపురం (కోర్టులు) న్యాయస్థానంలో న్యాయవాదుల గుమస్తాగా విధులు నిర్వర్తిస్తున్న వేల్పూరి సత్యనారాయణ 18వ తేదీన ఆకస్మికంగా మృతిచెందారు. ఈయన రాష్ట్ర న్యాయవాదుల గుమస్తాల సంఘ ఉపాధ్యక్షులుగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన మృతికి పెద్దాపురం బార్ ఆసోసియేషన్ హాలులో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు సంతాపం తెలిపి మౌనం పాటించారని బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రమణ్యం (మణి) తెలిపారు.

# కేరళ వరద బాధితులకు ఓఎన్‌జిసి సహాయం



కాకినాడ : కేరళ వరద బాధితుల సమాయార్థం భారత ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ అండ్ గ్యాస్ కార్పోరేషన్ లిమిటెడ్( ఓఎన్‌జిసి) మందులు, వైద్యబృందాలను పంపింది. ముంబాయి నుండి రెండు, కాకినాడ నుండి ఒక హెలికాప్టర్ లను వరద సహాయక చర్యల నిమిత్తం పంపడం జరిగిందని సంస్థ సింఎండి శశిశంకర్ తెలిపారు.కాకినాడ ,ముంబాయి నుండి ఇప్పటికే మందులు ఆహార పదార్థాలు, టెంట్లు, దుప్పట్లు,బట్టలు , ఇతర సహాయక పరికరాలను పంపడం జరిగిందన్నారు.బాధితులకు సహాయం, ఇతర కార్యకలాపాలు, విపత్తు నిర్వహణ సమూహాలతో కలసి తమ సంస్థ హెలికాప్టర్లు పనిచేస్తాయని తెలిపారు.విపత్తు నిర్వహణ సహాయార్థం అన్ని వనరులు సమీకరించి బాధితులను ఆదుకోవడం ప్రధాన బాధ్యతగా ఓఎన్‌జిసి భావించి తోడ్పాటును అందిస్తుందన్నారు.ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కేరళబాధిత ప్రజలకు ఓఎన్‌జిసి బాసాటగా నిలుస్తుందని తెలిపారు.

# కేరళ వరద బాధితులకు ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యార్థుల చేయూత



అచ్యుతాపురం: కేరళ వరద బాధితులకు సహాయార్థం ప్రశాంతి పాలిటెక్నిక్, ఐటిఐ విద్యార్థులు బియ్యం సేకరిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీనువాసరావు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ప్రకృతి విలయానికి నిరాశ్రయులైన ప్రజలను ఆదుకోవడానికి ప్రశాంతి విద్యాసంస్థల విద్యార్థులు సోమవారం నుండి బుధవారం వరకు బియ్యం సేకరిస్తున్నారన్నారు. సేకరించిన బియ్యాని నెహ్రూయువ కేంద్రం, ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆద్వర్యంలో కేరళకు పంపనున్నట్లు తెలిపారు. సోమవారం 3 క్వింటాళ్ళు బియ్యం సేకరించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి విద్యాసంస్థల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చేయూత నివ్వండి: హాస్య నటుడు ఎల్‌బి.శ్రీరాం




కాకినాడ: సమాజంలో ప్రతీ ఒక్కరూ దివ్యాంగులకు మరియు అనాథలకు చేయూత నివ్వాలని సమాజసేవ అలవర్చు కోవాలని సినిహాస్య నటుడు ఎల్ బి.శ్రీరాం పేర్కొన్నారు. సమాజ సేవకుడు చిట్నీడి శ్రీనివాస్ తన కుమార్తె లోహిత జన్మదినాన్ని పురష్కరించుకొని స్థానిక మహర్షి సాంబమూర్తి దివ్యాంగుల బాలికల పాఠశాలలో సేవాకార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సిని హాస్య నటుడు ఎల్‌బి.శ్రీరాం విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమం నిర్వాహకులు చిట్నీడి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని తన కుమార్తె జన్మదిన వేడుకలు ఈ పాఠశాలలో జరుపుకోవడం ఎంతో సంతోషానిచ్చిందన్నారు. పాఠశాలకు ఫ్యాన్‌లు, చాపలు, పుస్తకాలు అందించారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో చిట్నీడి నాగమణి, సుభాన్, డేగల రమేష్, డా.చెలికాని మనోజ్, సేతు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవున్ని దర్శించిన ప్రముఖులు







అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని ఆదివారము కొందరు ప్రముఖులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారిలో ముఖ్యంగా రాష్ట్ర హోంశాఖామాత్యులు నిమ్మ కాయల .చినరాజప్ప శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.

ఆయనకు అలయ మర్యాద లతో ఈవో ఎమ్.జితేంద్ర, పిఆర్వో తులా.రాముడు ఘన స్వాగతము పలికారు. దర్శనము అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజే యగా ఈవో జితేంద్ర వారికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. అదేవిధంగా శ్రీ స్వామివార్ని కాకినాడ అడిషనల్ ఎస్పీ శ్రీధర్, పుణేకు చెందిన టాటా ఇండస్ట్రీస్ ఎండీ దేశ్ ముఖ్ కుటుంబ సభ్యులతో శ్రీ స్వామివారిని దర్శించారు.

# జాతీయస్థాయిలో క్రీడాకారుల ప్రతిభ

యానాం: జాతీయ, రాష్ట్రస్థాయిలలో యానాం బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నట్లు యానాం బాల్ బాడ్మింటన్ క్లబ్ కార్యదర్శి కాపుగంటి శేషసుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాడ్మింట్ క్లబ్ క్రీడాకారిణి ఎడ్ల శాంతి మొట్ట మొదటిగా యానాం నుండి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో నిర్వహించిన అనేక బాల్‌బాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్లలో పాల్గొని తనయొక్క ప్రతిభతో చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్శిటి యందు స్పోర్ట్సుకోటా ఉచిత విద్యలో విబిఎ డిగ్రీపట్టా పొంది ఆల్ ఇండియా యూత్ నేషనల్ బాల్‌బాడ్మింటన్ టోర్నమెంట్‌లో బంగారు పతకాన్ని కైవసం చేసుకుందన్నారు. మరో క్రీడాకారుడు కాలాడి తరుణ్‌గణేష్ చెన్నై ఎస్టీ జోసెఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో స్పోర్ట్సు కోటా ఉచిత విద్యలో బిటెక్ (సివిల్) చదివే గొప్ప అవకాశం పొందేడన్నారు.

ఈ క్రీడాకారులు ఇంతటి ప్రతిభావంతులు కావడానికి కొచ్ బొట్టా శ్రీనివాస్ ఎంతగానో దోహదపడ్డారని క్రీడా అభిమాని మరియు స్పాన్సర్ యానాం బాల్‌బాడ్మింటన్ క్లబ్ సభ్యులు తెలిపారు. క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సాహిస్తున్న తల్లిదండ్రులను సీనియర్ క్రీడాకారులు ఆర్.విజయ్, ఎస్ శ్రీను, ఎం ప్రసాద్, తోటి క్రీడాకారులను, సభ్యులను పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు అభినందించారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందచేయాలి

**- జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్**



విశాఖపట్నం: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందచేయాలని, అందుకు అవసరమైన అన్ని మౌలిక వసతుల కల్పనకు ఆసుపత్రి అభివృద్ధి సొసైటి నిధులను వెచ్చించాలని జిల్లా కలక్టర్ ప్రవీణ్ కుమార్ అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆసుపత్రుల అభివృద్ధి సొసైటీ సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. కె.జి.హెచ్. ఇఎన్‌టి. ఐ చెస్టు, మెంటల్, గోషా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి సొసైటి నిధులు అందుబాటులో ఉంటే ఏ మాత్రం సంకోచించకుండా నియమనిబంధనలకు లోబడి ప్రభుత్వ ఆసుపత్రులల్లో మౌలిక వసతుల కల్పనకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఏజన్సీలను ఇప్పటి వరకూ నియమించుకోకుంటే వెంటనే నియమించు కోవాలన్నారు. సమర్థవంతంగా నిర్వహించే అవసరమైన మానవ వనరులను వెంటనే సమకూర్చుకోవాలన్నారు. 58 ఎకరాల విస్తీర్ణంలో నున్న ఇ.ఎన్.టి. చెస్టు, మెంటల్ ఆసుపత్రులకు విడివిడిగా ఆస్తిపన్ను వేసేలా జివిఎంసికి ప్రతిపాదనలు పంపాలని మెంట్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. మెంటల్ ఆసుపత్రిలో 40 కె.వి. ట్రాన్సుఫార్మర్ ఏర్పాటుకు అవసరమైన నిధులను రిఇంబర్స్‌మెంట్ బేసిస్‌పై ఆసుపత్రి సొసైటీ నిధులు వెచ్చిచేందుకు, అక్వాగార్డు ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. అభివృద్ధి పనులు నిర్వహణకు, అవసరమైన వైద్య పరికరాలు, ఔషదాల కొనుగోలుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు.

ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ ఎ. అర్జున్ (కెజిహెచ్), డాక్టర్ రఘునాథబాబు (ఇఎన్‌టి), డాక్టర్ సాంబశివరావు (చెస్టు), డాక్టర్ హేమలత (గోష), డాక్టర్ ఎస్. రాధారాణి (మెంటల్) తదితర ఆసుపత్రులతో పాటు ఆంధ్రామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తో చంద్రబాబు చెట్టాపట్టాల్

మొదటి పేజీ తరువాయి

నుంచి రైతులను ఆదుకుంటాం. ప్రమాదవశాత్తు రైతు చనిపోతే ఆ కుటంబానికి రూ. 5 లక్షలు ఇస్తాం. రైతుల ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్‌లు లేకుండా చేస్తాం.' అని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గొల్ల బాబురావు, మాజీ ఎమ్మెల్సీ డివి.సూర్యనారాయణరాజు, అనకాపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్ వరుదు కళ్యాణి, అనకాపల్లి పార్లమెంటరీ ఇన్‌ఛార్జి గుడివాడ అమర్‌నాథ్, నర్సీపట్నం సమన్వయకర్త పెట్ల ఉమాశంకర్ గణేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాదరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైకాపా అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలిస్తాం**

ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని.. భరోసా నింపేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర విశాఖపట్నంలో దిగ్విజయంగా కొనసాగుతోంది. జననేత చేపట్టిన పాదయాత్ర 241వ రోజు సోమవారం ఉదయం.. విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ శివారు గ్రామమైన ధర్మసాగరం క్రాస్‌రోడ్డు నుంచి ప్రారంభమైంది.

ధర్మసాగరం దగ్గర మహిళలు బారులు తీరి... వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు. కాగా చినుకులు పడుతున్నా పాదయాత్ర కొనసాగుతోంది. వర్షంలోనూ జననేత నడక సాగిస్తున్నారు.

అశేష జనవాహిని వెంటరాగా అడుగులు ముందుకు వేస్తున్నారు.

**మీరు ముఖ్యమంత్రి అయితేనే..**

పాదయాత్రలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కుంబా రవిబాబు వైఎస్ జగన్‌ను కలిసి... గిరిజనుల సమస్యలను వివరించారు. నర్సింగ్ విద్యార్థులు కూడా తమ సమస్యలను జగన్ దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ హయాంలో నోటిఫికేషన్లే లేవని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. జగన్ ముఖ్యమంత్రి అయితే ఉద్యోగాలు వస్తాయన్న భరోసాతో ఉన్నా మంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. వికలాంగులు కూడా తమ సమస్యల గురించి వివరించారు. త్వరలోనే వైఎస్ జగన్ పాయకరావుపేట నియోజకవర్గంలో అడుగు పెట్టనున్నారు. ఆ తర్వాత యండపల్లి, జల్లూరు, పాత తంగేడు, తంగేడు క్రాస్ మీదుగా కోట ఉరట్ల, కైలాసపట్నం వరకు ఇవాళ్టి పాదయాత్ర కొనసాగనుంది. సాయంత్రం కోట ఉరట్లలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో వైఎస్ జగన్ ప్రసంగించారు.





























# ప్రత్యర్థిని చిత్తు చేసి.. స్వర్ణ పతకం సాధించింది..



జకార్తా: ఆసియా క్రీడల్లో భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్ అద్భుత ప్రదర్శన చేసింది. సోమవారం 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ విభాగంలో భాగంగా జపాన్ రెజ్లర్ యూకీ ఇరెతో జరిగిన పోర్లో ప్రత్యర్థిని చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. బౌట్ అరంభం నుంచి వినేశ్ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. దూకుడుగా దాడి చేస్తూ.. పాయింట్లు సాధిస్తూ.. వచ్చింది. ఫలితంగా ఈ బౌట్‌లో వినేశ్ 6-2 తేడాతో విజయం సాధించి గోల్డ్ మెడల్ గెలుచుకుంది. గత ఆసియా గేమ్స్‌లో వినేశ్ కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత కామన్‌వెల్త్ క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు గెలుచుకుంది. అంతేకాక ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారత అథ్లెట్‌గా నిలిచింది. ఈ ఏడాది ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది రెండో స్వర్ణ పతకం. ఆదివారం పురుషుల 65 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో జపాన్ రెజ్లర్ తకాతాని దైచుతో హోరాహోరీ ఫైనల్లో అద్భుత ప్రదర్శన చేసిన బజరంగ్ పునియా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. కాగా విజయాలు సాధించిన వీరిద్దరిపై దేశ వ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది.



మూడు రోజుల పర్యటనార్థం మయన్మార్‌ను దర్శించిన ఐఎన్ఎస్ ఖంజర్ పర్యటనలో భాగంగా యాంగాన్, మయన్మార్‌కు చేరుకొని ఇరు దేశాల నావికా అధికారులు పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య నావికా సంబంధాలు మరింత బలపడనున్నాయి.



# మే నాటికి పోలవరం పూర్తి

## : మంత్రి దేవినేని ఉమ



ఢిల్లీ: దేశంలో నదుల అనుసంధానం చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి దేవినేని ఉమ చెప్పారు.గోదావరి-కావేరి అనుసంధానానికి ముందు నీటి లభ్యత లెక్కించాలని, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలను ఆమోదించాలని కోరామన్నారు. పోలవరానికి కేంద్రం రూ.2700 కోట్లు రీయింబర్స్ మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్3న పోలవరంలో గ్యాలరీ వాక్‌కు చంద్రబాబు హాజరవుతారని ఆయన తెలిపారు. ఫిబ్రవరి నాటికి గేట్లు, మే నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి అవుతాయని చెప్పారు. త్వరలో వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేస్తున్నామని, నీటి నిర్వహణలో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని దేవినేని ఉమ అన్నారు.

# రూ.2వేలు నోట్లను రద్దు చేయాలి : మంత్రి లోకేశ్



అమరావతి: దేశం అభివృద్ధి చెందాలంటే 2వేల రూపాయల నోట్లను రద్దు చేయాలని మంత్రి లోకేశ్ అన్నారు. రూ.500లకు మించి పెద్ద నోటు ఉండరాదన్నది తమ విధానమని స్పష్టం చేశారు. పెద్ద నోట్ల రద్దుకు 2012 నుంచి చంద్రబాబు పోరాడుతున్నారన్న లోకేశ్, గతంలోనూ రూ.1000, రూ.500నోట్ల రద్దుకు తీవ్రంగా ప్రయత్నించామని తెలిపారు. సచివాలయంలో ఐసీఐసీఐ బ్యాంక్ శాఖను ప్రారంభించిన సందర్భంగా ఈ విధంగా స్పందించారు.

# అవినీతి అనకొండ మంత్రి అయ్యన్న

## రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉండండి

## స్థాయి మరిచి జగన్‌పై వ్యక్తిగత దూషణలు చేయడం తగదు

## వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాద్ రెడ్డి



విశాఖపట్నం : అవినీతి అనకొండ మంత్రి అయ్యన్న పాత్రుడు అని, అవినీతి చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పోటీ పడుతున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. మద్దిలపాలెంలో గల వైసీపీ కార్యాయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యల పై అయ్యన్న తన సభ్యత, సంస్కారాన్ని మరిచి వ్యక్తిగత దూషణలు చేసే స్థాయికి దిగజారడం శోచనీయమన్నారు. తాను అవినీతి చేసానని నిరూపిస్తే రాజీనామా చేస్తానని అయ్యన్న అన్నారని, ఆ మాటకి కట్టుబడి రాజకీయ సన్యాసం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అయ్యన్న పెద్ద అవినీతి పరుడని, గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారని, గనులన్నీ దోచుకుతింటున్నారని స్వయంగా జిల్లాకు చెందిన మంత్రి గంటాయే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేయలేదా అని ప్రశ్నించారు. ఆ సమయంలో మంత్రి గంటా ఓ దొంగని, విశాఖ దోచుకుతింటున్నారని సాక్షాత్తు ముఖ్యమంత్రి సమక్షంలోనే చెప్పలేదా అని అయ్యన్నను ప్రశ్నించారు. ప్రజ చెప్పిన వాస్తవ పరిస్థితునే జగన్ బహిరంగ సభలో చెప్పారన్నారు. నాలుగు సంవత్సరాలుగా నర్సీపట్నం నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేసారని ప్రశ్నించారు. ఏ రోజె%నా జిల్లా మంత్రిగా గిరిజన ప్రాంతంలో పర్యటించి, విష జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారా అని అన్నారు. జిల్లా లో విశాఖను కలుషితం చేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే వెగపూడితో కలిసి కోడి పందాలను, గుర్రపు పందాలను, జూజం వంటి వాటిని ప్రోత్సహించి విశాఖ సంస్కృతని కలుషితం చేస్తున్నారన్నారు. మంత్రి అయ్యన్న రాజకీయ సన్యాసం తీసుకోవల్సిన అవసరం లేదని, ప్రజలే ఆయనను సాగనంపుతారని జోస్యం చెప్పారు. రానున్న ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలో టీడీపీ తుడిచిపెట్టుకు పోతుందని అన్నారు. సభ్యత, సంస్కారంతో మంత్రి అయ్యన్న మాట్లాడితే బాగుంటుందని అన్నారు. వైసీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ జగన్ చేస్తున్న ప్రజా సంకల్పయాత్రకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. జగన్ చేపట్టిన పాదయాత్రలో ప్రజు తమ సమస్యపై వినతి పత్రాలు అందిస్తున్నారని అన్నారు. ప్రజల దగ్గర నుంచి ఏవైతే విషయాు తొసుకున్నారో, ప్రజు ఏవైతే మనోభావాలను వ్లెడిరచారో వాటినే నర్సీపట్నం బహిరంగ సభలో జగన్ ప్రస్తావించారన్నారు. మంత్రి అయ్యన్న తనని ప్రశ్నించుకోవాలని, జగన్ మాట్లాడిన వాటిలో ఏమైనా అవాస్తవాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఇవ్వగలరా అని అయ్యన్నను ప్రశ్నించారు. ప్రజలు తెలిపిన విషయాను, ప్రజా సమస్యపై అయ్యన్నను ప్రశ్నించారే తప్ప, వ్యక్తిగతంగా ఎటువంటి విమర్శులు చేయలేదన్నారు. కాని అయ్యన్న తన స్థాయిని మరిచి వ్యక్తిగత విమర్శ చేశారన్నారు.

వాస్తవాలు మాట్లాడితే ఎందుకు ఉలిక్కి పడుతున్నారని అయ్యన్నను ప్రశ్నించారు. ఈ విలేకరు సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, ఎస్.చంద్రమౌళి, అనుబంధ విభాగం అధ్యక్షు పీలా వెంకటక్ష్మి, నగర మహిళా అధ్యక్షరాలు గరికిన గౌరి, జ్యోతి, బి.శ్యామ్‌కుమార్ రెడ్డి, బి.కాంతారావు, టి.సురేష్, బర్కత్ ఆలీ, బోని శివరామకృష్ణ, రాధ, వాసు, ఆనంద, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి యువశ్రీ, నగర కార్యదర్శి పీత మహేశ్, తదితయి పాల్గొన్నారు.

# కెజిహెచ్‌పై వచ్చే అభియోగాలపై విచారణ కమిటీ

**నెల రోజుల్లోపు నివేదిక**

**బాధ్యులైన వారిపై కఠిన చర్యలు**

**రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరొందిన కెజిహెచ్‌పై వస్తున్న పలు అభియోగాలపై విచారణ జరిపేందుకు కెజిహెచ్‌కు చెందని వైద్య నిపుణులతో కూడా కమిటీని నియమిస్తున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కెజిహెచ్‌ను మంత్రి సందర్శించి కెజిహెచ్ సూపరింటెండెంట్ డా. ఎ. అర్జున్, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.వి. సుధాకర్‌తో సమావేశమయ్యారు. కెజిహెచ్‌పై వస్తున్న అభియోగాలపై వారితో చర్చించారు. అనంతరం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ కెజిహెచ్‌లో రోగులపై మందుల ప్రయోగాలుగా జరుగుతున్నాయని వస్తున్న ఆరోపణలపై నిపుణులతో కూడిన కమిటీతో వచారణ జరిపిస్తామని మంత్రి తెలిపారు. కెజిహెచ్‌కు చెందిన వైద్య నిపుణులతో ఈ విచారణ జరిపిస్తామన్నారు. నెల రోజుల్లో ఈ నివేదిక వచ్చే విధంగా చూస్తామన్నారు. కెజిహెచ్‌లో ఈ మధ్య కాలంలో మరణించిన రామారావు మరణం సహజంగానే సంభవించిందని, ఇదే విషయాన్ని పోస్టుమార్టమ్ నివేదికలో నిర్ధారణ అయిందని తెలిపారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డా ఎ. అర్జున్, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.వి. సుధాకర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

చదవండి

చదివించండి

**విజయభాను**

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

# పదండి ముందుకు.. పదండి యాత్రకు..





అన్న అడుగులో అడుగేస్తూ.. విశాఖ జిల్లా నర్సీపట్నం నియోజకవర్గంలో జననేత వైఎస్ జగన్ చేపడుతున్న ప్రజా సంకల్ప యాత్రకు సంఘీభావంగా జగన్‌ను కలిసి ఆయనతో నడుస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, ఉత్తర నియోజకవర్గ నాయకుడు చొక్కాకుల వెంకటరావు ఫాలోవర్ సూరిశెట్టి లక్ష్మణ్, గ్రేటర్ విశాఖ 69వ వార్డు వైకాపా వార్డు అధ్యక్షుడు దాసరి రాజు, తదితరులు






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com

# రాజనీతిజ్ఞుని జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

**సిఆర్‌పిఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం**



విశాఖపట్నం: రాజనీతిజ్ఞుడు, మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చిననాడు యువత చిరకాలం గుర్తుంచుకుంటారని సిఆర్‌పిఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం అన్నారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు పి. సత్యకుమార్ ఆధ్వర్యంలో ఎంవిపి కాలనీ, ఆశవానిపాలెంలోగల ప్రభుత్వ మత్స్యకార ఎలిమెంటరీ పాఠశాలలో సోమవారం ఇటీవల దివంగతులైన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అకాల మరణానికి చింతిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొండు సీతారాం మాట్లాడుతూ రాజకీయ ఉన్నత విలువల కోసం వాజ్‌పేయి పోరాడరన్నారు. పేద విద్యార్థుల ఉన్నతికి సర్వశిక్ష అభియాన్ ప్రవేశపెట్టారని, ఇటువంటి మహానుభావుల చరిత్రను సువర్ణాక్షరాల రూపంలో ప్రచురించి పాఠకులకు అందజేయాలన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు విశేష కృషి చేయాలన్నారు. చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పి. సత్యకుమార్ మాట్లాడుతూ అచంచల ఆత్మవిశ్వాసం, రాజకీయ చతురత, రాజనీతిజ్ఞునిగా ఎన్నో విజయాలను సాధించిన ఆయన కీర్తి గణనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు తిర్లంగి హరి, ప్రధాన కార్యదర్శి జివి కుమార్, సభ్యులు కె. ఎల్లయ్య, వి. హేమసుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సత్యవాణి, కె. గాయత్రి, పి. రాజమణి, వి. నాగమణి, పాలకొల్లు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అరెస్టులకు సిఐటియు ఖండన

విశాఖపట్నం : హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ రోజు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిఐటియు గ్రేటర్ విశాఖనగర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది.

హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించి కనీస వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్పులు, ఫీజు రీయంబర్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి. నగరంలో 34 హాస్టళ్లలో 5వేల మంది చదువుతున్నారు. వీటిలో 23 హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కనీస వసతులు కరువవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. 30 నుండి 60మంది వరకూ ఒకే గదిలో ఉంటున్న దౌర్భాగ్యకర పరిస్థితులు నెలకొన్నయన్నారు. కావున పై సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు నగర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

## ఘనంగా రాజీవ్ గాంధి జయంతి వేడుకలు



అనకాపల్లి : దివంగత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ జయంతి వేడుకలు జిల్లా సేవాదళ్ ప్రదాన కార్యదర్శి కోరిబిల్లి పరి ఆద్వర్యంలో జరిగాయి. ముందుగా రాజీవ్ గాంధి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వందపడకల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసారు. ఈసందర్భంఘా పార్టీ నాయకులు గెంజి సత్యారావు, దాసరి సంతోష్ బుద్ద కిషోర్, దుర్గ, అల్లా గోవింద్, తదితరులు మాట్లాడారు. రాజీవ్ గాంధి దేశాన్ని అభివృద్ది పధం వైపు నడిపించిన, గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

# పేరు గొప్ప.. ఊరు దిబ్బగా ప్రజా సాధికార సర్వే



విశాఖపట్నం : సాధికార సర్వే తక్షణం సంపూర్ణముగా సక్రమంగా జరగాలంటే కలెక్టర్ ఆఫీస్ లోనే ఒక ప్రత్యేకమైన సెల్ల్ ఏర్పాటు చేయాలిని, ఇలానే ప్రతి జోన్ లోను సెల్ ఏర్పాటు చేసి సాధికార సర్వే, కే.వై.సి లింక్ పనులు ముందుకు సాగె విధంగా చర్యలు తీసుకోవాలిని కలెక్టరేటు గ్రీవెన్స్ లో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు విశాఖ వై.ఎస్.ఆర్.సి.పి నగర యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ వినతిపత్రం అందజేశారు.

అనంతరం కొండా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టిన ప్రజా సాధికార సర్వే పేరు గొప్ప ఊరు దిబ్బా క్రింద ఉందని ఎద్దేవా చేసారు. గతంలో రేషన్ కార్డు పొందాలంటే ఆధార్ కార్డు ఉంటె సరిపోయేది కానీ ఇప్పుడు సాధికార సర్వే అని, అలానే కే.వై.సీ సర్వే లింక్ అని చాలానే లింక్స్ పెట్టడం జరిగింది దీని వల్ల దొంగ రేషన్ కార్డులు ఎంతవరకు అరికట్టారో తెలీదు కానీ నిజమైన అర్హుల నోట్లు మాత్రం మట్టి కొడుతున్నారని మండిపడ్డారు. ప్రజా సాధికార సర్వే సిబ్బంది ఇంటింటికి వచ్చినప్పుడు చాల మంది ప్రజలు ఉద్యోగానికో కూలీపనికో మారె ఇతర బయట పనికో వెళితే ఇంకా మరి ఆ జాబితాలో వారి పేరు పెట్టలేనట్టే అలాని ఈ సిబ్బంది ఫలానా తేదీలలో ఫలానా టైములో వస్తారని ముందస్తు సమాచారం ఇస్తే ఆ వేళలలో ప్రజలు వారి ఇళ్ల దగ్గరే ఉంటారు కానీ అది చేయకుండా ఇది చేయకుండా తూతూమంత్రం కింద ప్రజా సాధికార సర్వే జరిగింది దీని వల్ల తప్పు ప్రభుత్వానిది శిక్ష ఏమో ప్రజలకి అన్న చందంగా తయారు అయింది అన్నారు . కనుక దయ చేసి వెంటనే ప్రత్యేక సాధికార సర్వే సెల్ ని కలెక్టర్ ఆఫీస్ లో ఏర్పాటు చేసి ప్రజలు అందరిని ఆ జాబితాలో చెరిపించి ప్రజలకి రేషన్ కార్డులు వచ్చా విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సెల్ ని 20 రోజులలో ఏర్పాటు చేయకపోతే బాదితులందరితోను కలిసి ధర్నా దిగుతామని కూడా స్పష్టం చేసారు కొండా రాజీవ్ గాంధీ. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి మాసిపోగు రాజు , అధికార ప్రతినిధి గుత్తుల నాగభూషణం, మైనారిటీ నాయకులూ ముజీఫ్ ఖాన్, 26 వార్డ్ ప్రధాన కార్యదర్శి జి.మూర్తి , వార్డ్ బీసీ సెల్ ప్రెసిడెంట్ జి.నాగిరెడ్డి, చెట్టిబోయిన విజయ్, బాదంపూడి వాసు , రెడ్నం మహేష్, సీతారెడ్డి, జిత్తుల దుర్గ,అశోక్ , సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# అన్ని సమస్యలను వెంటనే పరిష్కరిస్తా

**ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**

**డయల్ యువర్ ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ**



విశాఖపట్నం : సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే వాసుపల్లికి 59 వినతులు వచ్చాయి. వర్షం పడినప్పుడు మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నామని.. 29వ వార్డు, నేతాజీనగర్ వాసులు చెప్పారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. యూజీడీలతో అవస్థలు పడుతున్నామని.. 23వ వార్డు, రంగిరీజువీధికి చెందిన మహిళలు చెప్పారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని, ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. దొండపర్తిలో.. యుద్ద ప్రాతికన అభివృద్ధి పనులు చేవడుతున్నామని, సహకరించాలని.. స్థానికులను కోరారు. ప్రభుత్వ గృహం ఇప్పించాలని.. వన్టౌన్‌కు చెందిన మహిళ కోరారు. ఇల్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అర్హులైన పేదలకు దశల వారీగా ఇల్లు ఇస్తామని వివరించారు. వీధి దీపాలు వెలగడంలేదని 26వ వార్డుకు చెందిన మహిళ పోన్ చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టి వీధిదీపాలను అందుబాటులోకి తేవాలని అధికారులను అదేశించారు. డయల్ యువర్ ఎమ్మెల్యేకు వచ్చిన అన్ని సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని వెల్లడించారు.

అల్లూరి సత్యనారాయణ, లక్ష్మీ శివప్రసాద్ పాల్గొన్నారు.

# గెడ్డవాలు సమస్యలు పరిష్కారానికి కృషి



విశాఖపట్నం : నిన్న కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న జీవీఎంసీ 36 వార్డు లో గల జాషువానగర్, దేవేంద్ర నగర్ ప్రాంతాల్లో ఎంతీషిజూ సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించి వారి యొక్క ఇబ్బందులు అడిగి తెలుసుకుని వారిని వాదార్చి వెంటనే ఆ గెడ్డను పరిశీలించి తక్షణమే సంబంధించిన అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. రాజు గారికి అక్కడ పొంగిన గెడ్డలు , పడిపోయిన గోడలు చూపించి వారి ఆవేదనను వెళ్ళాబుచ్చారు ఈ ప్రాంతంలో పెరలసిస్ తో బాధపడుతున్న కె.వెంకటరమణ, జి. శ్రీనివాస్ లను కలిసి వారి మందుల ఖర్చులు నిమిత్తం కొంత ఆర్థిక సాయం చేశారు అశోక్ నగర్ లో ప్రాంతంలో గెడ్డకు రెండు వైపుల రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని, అయితే గెడ్డ అడుగు భాగంలో పూడిక తీసి క్రింద పాస్టింగ్ చేస్తే ఏ ఇబ్బంది ఉండదని అలాగే ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు అవసరం వున్నదని వీడి లైట్స్ లేకపోవడంతో చుట్టుప్రక్కల వారు చాలా ఇబ్బందులు లకు గురవుతున్నామని స్థానికులు తెలియజేసారు. ఈ సమస్యల పై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో 36 వార్డు ఎంతీషిజూ అధ్యక్షుడు కె.ప్.రత్నాకర్, ౦షి సెల్ అధ్యక్షుడు కె.వెంకత స్వామి, నమ్మి శంకర్, దాసు, వెంకటప్పారావు, అచ్చారావు , అజయ్, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, ఉషా తదితరులు పాల్గొన్నారు


# గెడ్డ పనులను వేగవంతం చేయండి

*- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్- గెడ్డకు ఇరువైపుల చెట్ల పెంపకం చేపట్టండి*

*- రహదారులు, పుట్‌పాత్‌లను ఆక్రమించవద్దు - గెడ్డ ప్రక్కన చెత్తను తక్షణం తోలగించండి*

*- స్మశానంలో చితి కనిపించకుండా రేకులు వేయండి*

*- పాడైన బడ్డీలు, వాహనాలను తోలగించండి*



విశాఖపట్నం: ఏ.యస్. రాజా గ్రౌండ్స్ ప్రక్కన గెడ్డ విస్తరణ పనులను తక్షణం పూర్తి చేయాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో సోమవారం ఆయన పర్యటించి పలు సూచనలు చేశారు. గెడ్డకు ఇరువైపుల చెట్ల పెంపకం చేపట్టాలని ఆదేశించారు. అనంతరం గెడ్డ వెంబడి పరిస్థితిని పరిశిలించారు. తదుపరి బి.యస్.ఎన్.ఎల్ కార్యాలయం వద్ద పుట్‌పాత్ ఆక్రమించి హెూటల్ నడుపుతున్న వ్యక్తులను రహదారి పుట్‌పాత్‌లను ఆక్రమించవద్దని ఆదేశించారు. గెడ్డను ఆనుకొని ఉన్న రోడ్ పై చెత్త పోగులుగా ఉండడాన్ని గమనించి తక్షణం తొలగించాలని పేర్కొన్నారు. స్మశానంను ఆనుకొని చితిమంటలు కన్పిస్తున్నాయని, అవి కనిపించకుండా రేకులు వేయడం, చెట్లను పెంచాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేయగా ఇ.ఇ వెంకటిని రేకులు వేసి, మొక్కలు నాటాలని ఆదేశించారు.

పాడైన బడ్డీలు, వాహనాలు అక్కడ ఉంచడం వలన ఇబ్బందులెదురవుతున్నాయని పేర్కొనగా వాటి తొలగింపుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ పి.నల్లనయ్యను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి తదితరులు పాల్గోన్నారు.

# మీ కోసం (ప్రజావాణి 220 దరఖాస్తులు)



విశాఖపట్నం : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం (ప్రజావాణి) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ వినతులను అధికారులకు సమర్పించారు. సోమవారం మీ కోసం కార్యక్రమానికి 220 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.సృజన, జెసీ-2 డా.సిరి, డిఆర్‌ఒ సత్తిబాబు, గోవిందరాజులు మీ కోసం కార్యక్రమంలో పాల్గొని పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి స్వయంగా వినతులను స్వీకరించారు.

**స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ - 2018కు ఓటు చేసి జిల్లాకు మంచి ర్యాంకు తీసుకురండి ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి**

జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి శాఖకు సంబంధించి పెండింగ్ ఫైల్స్ లేకుండా చూసుకోవాలన్నారు. అల్ప పీడనం కారణంగా జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని మండలాల లోను, మండలాధికారులు, ప్రత్యేకాధికారులు అప్రమత్తంగా ప్రధాన కేంద్రాలలో అందు బాటులో వుండాలన్నారు.

**డయల్ యువర్‌కలెక్టర్‌కు 10 ఫోన్‌కాల్స్**

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం 10 ఫోన్‌కాల్స్ ద్వారా బాధితులు తమ వినతులను విన్నవించుకున్నారు. జెసి-2 డా.సిరి ఫోన్‌కాల్స్ స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

## లాంగ్ సర్వీస్ అవార్డును పొందిన ఉక్కు ఉద్యోగి ఆనంద్



గాజువాక: విశాఖ ఉక్కుకర్మాగారంలోని ఎంఎంఎస్‌ఎం విభాగంలో 25సం. సర్వీస్ పూర్తిచేసిన ఉక్కు ఉద్యోగి ఆనంద్‌కు లాంగ్ సర్వీస్ అవార్డును విభాగాధిపతి ఐ.వి.జి.రావు అవార్డును అందజేసారు. ఎంఎంఎస్‌ఎం విభాగంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేసారు. ఈ సంధర్భంగా విభాగాధిపతి ఐ.వి.జి.రావు మాట్లాడుతూ 25సం. ఒకే సంస్థలో విధులు నిర్వహించడం గొప్పవిషయమని అన్నారు. సుమారు 30మందికి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఉక్కు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. లాంగ్ సర్వీస్ అవార్డు గ్రహీత ఉక్కు ఉద్యోగి ఆనంద్ మాట్లాడుతూ ఉక్కులో 25సం. విధులను అంకితభావంతో నిర్వహించినట్లు తెలిపారు. అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. రానున్న రోజులలో ఉక్కు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ అవార్డును ప్రదానం చేసిన ఉక్కుయాజమాన్యానికి, విభాగపు అధిపతికి కృతజ్ఞతలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎం.ఎస్.ఎం. డిజిఎం. సైబాల్‌సేన్, ఎజిఎంలు బి.గణేశ్, గులాం సర్వర్, హెచ్‌ఆర్ విభాగం అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గాజువాకలో విశాఖ వెస్టర్న్ డాన్స్ ఉత్తరాంధ్ర మెగామీట్



గాజువాక: నియోజకవర్గంలోని బి.సి.రోడ్డు సమీపంలోని టిఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం విశాఖ వెస్టర్న్ డాన్స్ ఉత్తరాంధ్ర మెగామీట్ కార్యక్రమాన్ని విశాఖ థ్రిల్లర్స్ వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గాజువాక తెదేపా ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు, వైకాపా సమన్వయకర్త తిప్పలనాగిరెడ్డి, పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే పి.గణబాబులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా మాజీ ప్రధాని భారతరత్న ఎ.బి.వాజపాయి కి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని నిర్ణయించారు. అలాగే విశాఖలో జరిగే షూటింగ్‌లలో స్థానిక నృత్యకళాకారులకు(డాన్సర్స్) అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రమేష్, కార్యదర్శి సూర్యనారాయణ, లుక్స్ రాజశేఖర్, మాక్స్ సంతోష్, మెల్బోర్న్ సంతోష్, సుమారు 1000మంది డాన్స్ కళాకారులు పాల్గొన్నారు.